ప్రజాశక్తి
శ్రీకాకుళం

శుక్రవారం
జనవరి - 5
2018
12 పేజీలు



"ఏ ప్రాంతానికి వెళ్లినా శ్రీకాకుళం జిల్లావాసులే మట్టి పనులు చేసుకుంటున్నారు. వెనుకబాటుతనమే ఇందుకు కారణం. ఈ పరిస్థితి మారాలి. పనుల కోసం ఇతర ప్రాంతాల వారు ఈ జిల్లా వైపు చూసేలా అభివృద్ధి చేస్తాను. జిల్లాను పారిశ్రామిక కేంద్రంగా మారుస్తాను."

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

వెనుకబాటు వల్లే వలసలు

- త్వరలో భావనపాడు పోర్టు నిర్మాణం
- ఉద్దానం కిడ్నీ బాధితుల మందుల కోసం రూ.10 కోట్లు మంజూరు
- ఇచ్ఛాపురంపై వరాల జల్లు
- 'జన్మభూమి'లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి/ఇచ్ఛాపురం/సోంపేట/కంచిలి

వెనుకబాటుతనం వల్లే జిల్లా నుంచి వలసలు ఉంటున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఇచ్ఛాపురం మున్సిపాల్టీ పరిధిలోని సురంగిరాజా వారి మైదానంలో గురువారం నిర్వహించిన ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. జిల్లాలో వంశధార, నాగావళి వంటి నీటివనరులు ఉన్నాయని, 193 కిలోమీటర్ల మేర సముద్ర తీరప్రాంతం ఉందని, అభివృద్ధికి అన్ని అవకాశాలూ ఉన్నాయన్నారు. జిల్లాకు భావనపాడు పోర్టు వస్తుందని, దీంతో శ్రీకాకుళం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు.



జన్మభూమి సభలో పాల్గొన్న ప్రజలు

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా..

ఈ ఏడాది నుంచి జిల్లా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానన్నారు. వంశధార ప్రాజెక్టుకు రైతులు సహకరించారని, అది పూర్తయితే ఇచ్ఛాపురం వరకూ నీళ్లు వస్తాయని చెప్పారు. వంశధార, నాగావళి నదుల అనుసంధానం పనులు జరుగుతున్నాయని, మార్చి నాటికి పూర్తవుతాయని వెల్లడించారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పూర్తి చేయడంతో పాటు కరకట్టల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. దీంతోపాటు వంశధార, బాహుదా నదుల అనుసంధానానికీ చర్యలు చేపడతామన్నారు. జిల్లాకు కావాల్సినన్ని ఎత్తిపోతల పథకాలను మంజూరు చేస్తామని చెప్పారు. తోటపల్లి, నారాయణపురం కాలువల ఆధునికీకరణ పనులకు సంబంధించిన నివేదికకు ఆమోదం తెలపాల్సి ఉందన్నారు.

కిడ్నీ బాధితుల మందుల కోసం రూ.పది కోట్లు

ఉద్దానం కిడ్నీ బాధితుల కోసం (మిగతా...4లో)



జన్మభూమి సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

23న స్కీమ్‌వర్కర్ల సమ్మె



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

- కార్మికులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలి
- బడ్జెట్‌లో ప్రభుత్వ పథకాలకు నిధులు పెంచాలి
- 12న స్కీమ్‌వర్కర్ల జిల్లా సదస్సు
- 20, 21న జీపు జాతా
- సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు పథకాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న స్కీమ్‌వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసు, డి.గోవిందరావు డిమాండ్ (మిగతా...4లో)

కొనసాగుతున్న 'జన్మభూమి'

ప్రజాశక్తి-సారవకోట

మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో జరిగిన జన్మభూమి మా ఊరు గ్రామసభలో రసాభాసాగా సాగింది. సర్పంచ్ తనయుడు యాళ్ల శ్యామసుందరరావు అధ్యక్షతన తహశీల్దార్ ఈశ్వరమ్మ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పి.మోహనరావు మాట్లాడుతూ కుమ్మరిగుంట పంచాయతీలో చెరువులు ఆక్రమణలను ఎందుకు తొలగించలేదని తహశీల్దార్‌ను ప్రశ్నించారు. ఏడుగురు కుటుంబ సభ్యులతో జీవనాన్ని గుడుపుతున్నాననీ, తనకు ఎందుకు రేషన్‌కార్డును మంజూరు చేయరని తండ్యాల పాపమ్మ ఆవేదన చెందారు. అయితే వినతులు చెప్పుకోవడానికి వచ్చిన వారికి అంతగా ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో సభ రసాభసాగా సాగింది. అలాగే గ్రామానికి చెందిన సింహాచలం మాట్లాడుతూ తనకు వృద్ధాప్య పింఛన్‌ను ఎందుకు మంజూరు చేయడంలేదని ప్రశ్నించారు. మరుగుదొడ్లుకు బిల్లులు మంజూరుకావడంలేదని బత్తిలి సావిత్రితో పాటు పలువురు ఆవేదన చెందారు. అలాగే అలుదులో కూడా జన్మభూమి నిర్వహించారు. కిడిమి, జమచక్రం గ్రామసభలకు ఎంపిడిఒ ఎ జగదీశ్వరరావు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామస్తులు, సర్పంచ్‌లు సిద్ధా సాంబమూర్తి, యాళ్ల శ్యామ్, వి రాఘవ, పాలయ్య పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలో జన్మభూమి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.గురువారం మండలంలోని నివగాం, వసప,ఎమ్‌జె.పురం,పొన్నుటూరు గ్రామాల్లో జన్మభూమి -మా ఊరు కార్యక్రమం ఎంపిడిఒ పి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని కోరారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచే బాధ్యత ప్రజలదేనన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.సావిత్రి, సర్పంచులు విజయలక్ష్మి, ఆనందరావు, టి.సులోచన, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

టెక్కలి: భూరగాం గ్రామంలో జనపాన చినబాబురెడ్డి అధికారులను సూటిగా ప్రశ్నించారు. జన్మభూమి - మా ఊరు గ్రామ సభలు భూరగాం, ముఖలింగాపురం, శాసనాం, గూడేం పంచాయతీల్లో గురువారం సభలు జరిగాయి. ఈ సందర్భంగా భూరగాం గ్రామంలో జరిగిన గ్రామసభల్లో చినబాబురెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు మంచి నీటి సౌకర్యం లేదనీ పంచాయతీల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందనీ, పాఠశాల భవనాల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. దీనిపై అధికారులు స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ నివ్వడంతో ప్రజలు సభలకు అంగీకారం తెలిపారు. సమావేశంలో జడ్‌పిటిసి కర్ణిక.సుప్రియ, మండల ఉపాధ్యక్షులు హనుమంతు.రామకృష్ణ, టిడిపి నాయకులు చాపర.గణపతి, మామిడి.రాము, దల్లి ప్రసాద్‌రెడ్డి, తహశీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

హిరమండలం: పాతపట్నం నియోజకవర్గ ఎంఎల్‌ఎ కలమట వెంకటరమణ ఆధ్వర్యంలో మండలంలో గొట్టా,పింద్రువాడ గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గొట్ట గ్రామంలో నిర్వహించిన జన్మభూమిలో ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరికీ అందించాలన్నారు.ఈ మేరకు పలువురు మాట్లాడుతూ ఉపాధిహామి పథకంలో కూలీ తక్కువ వస్తున్నాయని,అంగన్‌వాడీ కేంద్రంలో సరకులు అందించటం లేదని పలవురు పేర్కొన్నారు.అలాగే ఇంకుడుగుంతులు,వ్యక్తిగత మరుగుదొడ్లుకు బిల్లులు అందించలేదని వారు పేర్కొన్నారు.దీనిపై సంబందిత లబ్దిదారులకు త్వరితంగా బిల్లులు మంజూరుచేయాలని సంబందిత అధికారులకు చెల్లించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమాల్లో ప్రత్యేకాధికారి సిహెచ్ లక్ష్మణరావు,ఎంపిడిఒ వి.రామస్వామి,తహశిల్దార్ ఎం.కాళిప్రసాద్,మండల స్థాయి సిబ్బంది,ప్రజాప్రతినిధులు ఉన్నారు.



చెక్కును అందజేస్తున్న బర్డ్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు

పేదలకు ఆర్థిక సహాయం

టెక్కలి: పట్టణంలోని పలు పేద కుటుంబాలకు బర్డ్స్ ఆర్గనైజేషన్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మేజర్ పంచాయతీ పరిధిలోని బెల్లాన మున్నమ్మ, ఎం.ఆది, కొంకి రాజులు కుటుంబాలకు సంస్థ ప్రతినిధులు ఆధ్వర్యంలో ఒకొక్కరికి రూ.6000 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.సురేష్, ఉమామహేశ్వరరావు, సంతోష్‌లు చేతుల మీదుగా చెక్కులను పంపిణీ చేశారు.

సిఎం పర్యటనతో ఇక్కట్లు

నందిగాం: జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనను దష్టిలో పెట్టుకొని సమావేశానికి ప్రజలను తరలించేందుకు అధిక మొత్తంలో బస్సులను వినియోగించడంతో కళాశాలలు,పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు, వివిధ అవసరాల నిమిత్తం ప్రయాణాలు చేసే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.ఉదయం నుంచి రావాల్సిన పల్లెవెలుగు బస్సులు రాకపోవడంతో విద్యార్థులతో పాటు ప్రయాణీకులు కళాశాలలకు చేరలేక ప్రయాణం సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రయాణీకులు ఆటోలను, ద్వి చక్ర వాహనాలపై ఆధారపడి ప్రయాణం సాగించారు. పల్లెవెలుగు బస్సులను నడకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

సారవకోట: పాతపట్నం షేర్ ఆర్గనైజర్ అధ్యక్షులు కలమట భుజంగరావు ఆర్థిక సాయంతో మండలంలోని పాతూరు గ్రామానికి చెందిన వృద్ధులకు దుప్పట్లను మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పంపిణీ చేశారు. గురువారం పిఎల్‌పురం సర్పంచ్ కాళ్ల సింహాచలం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణదాస్ పాల్గొన్నారు. కార్యక్రమంలో షేర్ ఆర్గనైజర్ వైస్ ప్రెసిడెంట్ కలమట అప్పన్న, సర్పంచులు బి లక్ష్మీనారాయణ, కె.సింహాచలం, బంకి రమణ, కరణం మనోహర్ పాల్గొన్నారు.

చెత్త తొలగింపు

కొత్తూరు: స్థానిక కుమ్మరి వీధిలో కాలువల్లో పూడుకుపోయిన చెత్తను పారిశుధ్య కార్మికులు గురువారం తొలగించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఇందిరారామ్ మాట్లాడుతూ కాలువల్లో చెత్త వేయకుండా చెత్త బుట్టలో వేసుకుని దూరంగా తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

'స్వచ్ఛ భారత్'పై అవగాహన ర్యాలీ

భామిని; మండల కేంద్రంలో గురువారం ప్రభుత్వ జూనియర్ కాలేజ్ మరియు మోడల్ స్కూల్ విధ్యార్థులు కలిసి స్వచ్ఛభారత్ పై అవగాహన ర్యాలీ జరిపారు.కాలేజీల నుండి నాల్గురోడ్ల కూడలీ లో నున్న అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ గా వచ్చి వృత్తాకారంగా ఏర్పడిన విధ్యార్థులు ఆరుబయట మలవిసర్జన నిర్మూలించాలంటూ నినాదాలు చేశారు.తక్షణమే మరుగుదొడ్లు నిర్మించాలని పిలుపు నిచ్చారు.పరిసరాలు పరిసుభ్రత పాటించాలన్నారు.

కత్తులకవిటిలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

కత్తులకవిటి గ్రామంలో గురువారం శ్రీసత్యసాయి సేవాశ్రయం దశమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వైద్యతనిఖీల్లో 1275 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆయుర్వేదిక్, జనరల్, ఎముకలు, నేత్ర, చర్మవ్యాదులు, శస్త్రచికిత్సలు తదితర వైద్యానికి సంబంధించి ప్రత్యేక వైద్యనిపుణులు తనిఖీలు చేసి మందులు పంపిణీ చేశారు. అంతకు ముందు ఒక్కొక్క విభాగానికి సంబంధించి ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రామ్మోహనరావు, ఎస్.లక్ష్మి, డి.శేషగిరిరావు, శకుంతల, కిరణ్‌కాంత్, ఎ.రామకృష్ణ, బి.కృష్ణ మోహన్, ఎస్ఎస్‌వర్మతో పాటు పలువురు వైద్యనిపుణులతో పాటు రౌతు విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో సీతంపేట డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమగండి, అక్కన్నగూడలో గురువారం మరుగుదొడ్లపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాబిన్‌కుమార్‌పాడి మాట్లాడుతూ జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ హెచ్‌వై.దొర, అధ్యాపకులు కిశోర్, ఎన్ఎస్ఎస్ పిఒ శంకరరావు తదితరులున్నారు.

సిపిఎస్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-సంతబొమ్మాళి

ఉద్యోగులకు పెనుభారంగా ఉన్న సిపిఎస్‌ను తక్షణమే రద్దు చేయాలని, పాత విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయులు కోరారు. గురువారం ఆకాశలక్కవరం గ్రామంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో తహశీల్దార్ రామారావు, ఎంపిపి కె.కృష్ణవేణికి ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. సిపిఎస్ విధానంతో ఉద్యోగులు ఏ విధంగా నష్టపోతారో వివరించారు. సిపిఎస్ విధానం నష్టదాయకమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.తాతంనాయుడు, సింహాచలం, జనార్ధనరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ క్యాలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సంతబొమ్మాళి

మండల కేంద్రమైన సంతబొమ్మాళిలో యుటిఎఫ్ 2018 క్యాలండర్‌ను గురువారం యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.కామేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ పోరాటాలకు సభ్యులంతా సిద్ధంగా ఉండాలన్నారు. హక్కులు కోసం న్యాయమైన పోరాటాలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఆనందరావు, సామ సంజీవరావు, ప్రతినిధులు గణపతి, దామోదరరావు, నూకరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల ఆవశ్యకతపై ర్యాలీ

ప్రజాశక్తి-సంతబొమ్మాళి

స్వచ్ఛాంధ్రలో భాగంగా గురువారం నౌపడ కళాశాల విద్యార్థులు వ్యక్తిగత మరుగుదొడ్ల ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహించారు. బహిరంగ మల విసర్జన చేయొద్దని, ప్రతి కుటుంబం వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, లెక్చరర్లు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆటోను ఢీకొన్న చెరుకు లారీ

పది మందికి గాయాలు

ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి- రాజాం

రాజాం-శ్రీకాకుళం రోడ్డులోని హీరోహోండా షోరూం దరిలో గురువారం రాత్రి వ్యవసాయ కూలీలతో ప్రయాణిస్తున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న చెరుకు లారీ ఢీకొంది. ఈ సంఘటనలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు పది మంది ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నం తరలించారు. పోలీసుల కథనం మేరకు... సంతకవిటి మండలం మిర్తివలసకు చెందిన వ్యవసాయ కూలీలు పొనుగుటివలసలో వరినూర్పుల పనులకు వచ్చారు. పనులు ముగించుకొని తిరుగు వెళ


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

_ండగా మార్గమధ్యంలో ఎదురుగా లైట్లు లేకుండా వస్తున్న చెరుకు లారీ మితిమీరిన వేగంతో వచ్చి ఢీకొంది. ఈ సంఘటనలో ఆటో బోల్తా పడగా, అందులోని ప్రయాణికులంతా గాయపడ్డారు. ఇందులో పాండ్రంగి అప్పలనాయుడు తీవ్రంగా గాయపడడంతో జిఎంఆర్‌కేర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం విశాఖపట్నం కెజిహెచ్‌సికి తరలించారు. కెల్ల సురేష్, పాసింజర్లు కె.లక్ష్మి, జి.కల్యాణి, డి.మంగమ్మ, పి.తవిటమ్మ, ఆర్.మంగమ్మ, వై.సింహాచలం, ఎ.నారాయుడు, జి.చిన్నమ్మడు, ఎల్.పార్వతిలు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ ఈశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్రైమ్ కార్నర్


మృతి చెందిన గోవింద

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- లావేరు

విద్యుత్ తీగ తెగిపడడంతో తీగను తాకిన వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం బొంతుపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... బొంతుపేటకు చెందిన బొంతు గోవింద (42) గురువారం తెల్లవారుజామున ఐదు గంటలకు బహిర్భూమి కోసం చెంబుతో నీల్లు పట్టుకుని వెళ్లాడు. అప్పటికే జాతీయ రహదారి పక్కన ఆనుకొని ఉన్న కెకె గ్రానైట్ పరిశ్రమకు వెళ్తున్న విద్యుత్ వైరు తెగిపడిపోయి ఉంది. దీనిని గమనించని గోవింద్ ప్రమాదవశాత్తు తీగను తాకడంతో వెంటనే షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఎఎస్ఐ బి.కృష్ణారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విద్యుత్ ఎఇ సురేష్‌కుమార్ పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. తల్లి తవిటమ్మ ఉంది. పెద్ద కుమారుడు మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తుంది.

వెలమ సంఘం నూతన కార్యవర్గం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం నగరం, రూరల్ మండల వెలమ సామజిక తరగతి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గురువారం స్థానిక 80 అడుగుల రోడ్డులోని ఆనందసాయి ఫంక్షన్ హల్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షులు అసిరినాయుడు ప్రకటించారు. రూరల్ అధ్యక్షులుగా బగ్గు అసిరినాయుడు, ఉపాధ్యక్షులుగా చింతు మోహనరావు, ప్రధాన కార్యదర్శిగా దుంగ అప్పల స్వామినాయుడు, సహాయ కార్యదర్శిగా పి.కామేశ్వరరావు, కోశాధికారిగా దుంగ శ్రీధర్‌ను ఎన్నుకున్నారు. నగర అధ్యక్షలుగా కింజరాపు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షలుగా మూకళ్ల రామారావు, ప్రధాన కార్యదర్శిగా జి.వాసుదేవరావు, సహాయ కార్యదర్శిగా ఎం.సింహచలం, కోశాధికారిగా సాధు ప్రసాదరావు, సభ్యులుగా రుప్ప రమణమూర్తి తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అంబటి చక్రధర్‌రావు, ఎం.రామ్మోహన్‌రావు, జి.శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

సంగాంలో కొట్లాట : ఇరువురికి గాయాలు

ప్రజాశక్తి- రాజాం/వంగర


గాయపడిన శ్రీరాములు

వంగర మండలం సంగాంలో గురువారం రాత్రి ఇరు గ్రూపుల మధ్య కొట్లాట జరిగింది. ఈ సంఘటనలో ఒక గ్రూపుకు చెందిన అల్లు శ్రీరాములు, మరో గ్రూపుకు చెందిన సంగాంలకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... శ్రీరాములు తల్లికి పసుపు కుంకం కింద కొంత భూమిని మేనమామ అయిన సంగాం గతంలో ఇచ్చారు. అయితే ఇటీవల ఈ రెండు కుటుంబాల మధ్య విభేదాలు తలెత్తడంతో గతంలో ఇచ్చిన భూమిని తిరిగి తీసుకునే ప్రయ్నత్నం చేశారు. దీంతో శ్రీరాములు కుటుంబ వారిపై గొడవకు దిగింది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి శ్రీరాములు కుటుంబంపై సంగాం కుటుంబీకులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో శ్రీరాములుకు తీవ్రగాయాలు కావడంతో గ్రామం నుంచి పారిపోయి వంగర పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. తననూ కొట్టారని సంగాం చెప్పుకొస్తున్నాడు. వీరిరువురు ఫిర్యాదుపై వంగర పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లావేరు ఎంపిపి మామ మృతి

ప్రజాశక్తి- లావేరు


లక్షుంనాయుడు (ఫైల్)

మండల పరిషత్తు అధ్యక్షులు మీసాల శాంతమ్మ మామ మీసాల లక్షుంనాయుడు (80) అనారోగ్యం బుధవారం తెల్లవారుజామున అదపాకలో మృతి చెందారు. ఆనయకు ఐదురుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు రమణ భార్య ఎంపిపి శాంతమ్మ. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ మంత్రి కిమిడి కళావెంకటరావు పిఎ బి.వెంకట్‌నాయుడు, మండల ప్రత్యేక ఆహ్వానితులు ముప్పిడి సురేష్, ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, జెడ్‌పిటిసి భర్త పి.మధుబాబు, ఎంపిడిఒ ఎం.కిరణ్‌కుమార్, తహశీల్దాస్ ఎస్.సుధాసాగర్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు.

అక్రమ నిర్మాణాలపై పోరాటం

మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలో నిబంధనలకు వ్యతిరేకంగా టిడిపి ప్రోత్సహంతో నిర్మితమవుతున్న అక్రమ నిర్మాణాలపై పోరాటానికి సిద్ధం కావాలని వైసిపి నాయకులు, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నగర పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీగా ప్రజలు పక్షాన ప్రభుత్వ అక్రమాలపై పోరాటం చేసేందుకు నాయకులు, కార్యకర్తలకు సన్నద్ధం కావాలన్నారు. టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు అక్రమాలు, అరాచకాలపై ప్రజల తరుపున ప్రశ్నించే సమయం వచ్చిందన్నారు. అరసవల్లిలో ఆలయం భూమిని ఆక్రమించి టిడిపి ప్రజా ప్రతినిధులు సహాయంతో అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న కల్యాణ మండపాన్ని అడ్డుకునేందుకు పాదయాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీతో పాదయాత్ర చేస్తూ అక్రమ నిర్మాణం వద్దకు చేరుకోనున్నట్లు ప్రకటించారు. నగరంలోని 50 డివిజన్ల నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు పాదయాత్రలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎం.వి.పద్మావతి, కె.ఎల్.ప్రసాద్, సాధు వైకుంఠరావు, మండవిల్లి రవి తదితరులు పాల్లొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యుత్‌శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోమని సంఘం రీజనల్ అధ్యక్షులు కె.పైడిరెడ్డి తెలిపారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో గురువారం నిర్వహించిన సమావేశంలో హాజరై మాట్లాడారు. పెన్షన్‌తో పాటు విశ్రాంత ఉద్యోగులకు వైద్య సేవలు అందించడంలో సంఘం కృషి చేస్తోందని చెప్పారు. వ్యక్తిగత సమస్యలతో పాటు సభ్యులందరికీ ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ ఉద్యోగిగా పనిచేసిన కాలంలో సాంకేతిక కారణాల వల్ల ఉద్యోగ విరమణ పొందిన తర్వాత రావాల్సిన భత్యాలు అందని వారు వారి లభ్యత ఆధారాలతో సంఘ సభ్యులను సంద్రించాలని సూచించారు. సమావేశంలో సంఘం రీజనల్ కార్యదర్శి ఆర్.విశ్వనాథరావు, కన్వీనర్ పి.పోలినాయుడు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు యు.జనార్ధనరావు, వి.జయరాం, కోశాధికారి ఎస్.గోపాలరావు పాల్గొన్నారు.

ప్రాథమిక చికిత్సపై అవగాహన

శ్రీకాకుళం సిటీ: విద్యార్థులకు ప్రాథమిక చికిత్సపై ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పించారు. గురువారం నగరంలోని గుజరాతీపేట వరం నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థులకు నీటిలో మునక, పొలబారడం, పాముకాటు, కుక్కకాటు, షాక్‌కు గురికావడం, రక్తస్రావం అరికట్టడం, ప్రాథమిక చికిత్సపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ మాదిరిగా జూనియర్ రెడ్‌క్రాస్‌ను రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాల యాజమాన్యాలు సహకరించి జూనియర్ వింగ్‌ను తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల


అవగాహన కలిగిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధి

హెచ్‌ఎం పి.ఇందిరామణి, ఆర్.వెంకటేశ్వరరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు జి.విజయబాబు, బి.శ్రీధర్ పాల్గొన్నారు.


గాయపడిన విద్యార్థులు

విద్యార్థులపై తేనెటీగలు దాడి

ప్రజాశక్తి- సంతకవిటి

మండల కేంద్రంలో స్థానిక జూనియర్ కళాశాలలో చదువుతున్న పది మంది విద్యార్థులపై గురువారం తేనెటీగలు దాడిచేశాయి. కళాశాల వద్ద పెట్రోల్ బంక్ వైపు ఉన్న తోటవైపు విద్యార్థులు మూత్రవిసర్జనకు వెళ్లారు. దీంతో ఒక్కసారిగా తేనెటీగలు వీరిపై దాడిచేశాయి. ఈ దాడిలో కళాశాలకు చెందిన సిహెచ్.సాయి, ఆర్.గోవిందరావు, కె.రవిబాబు, మోహనరావు, ధనలక్ష్మి, శారద, వీరబాబు, నూకరాజులకు గాయాలయ్యాయి. దీంతో విద్యార్థులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని చికిత్స చేయించుకున్నారు. ఎటువంటి ప్రాణహాని లేదని వైద్యులు చెప్పారు.


చికిత్స పొందుతు పద్మ

బొద్దాంలో మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- రాజాం

మండలంలోని బొద్దాంలో గురువారం మడ్డు పద్మ అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. భర్త మద్యం సేవిస్తూ బాధ్యతారాహిత్యంగా తిరుగాడుతున్నాడనే బాధతో మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు ఆటో సహాయంతో క్షతగాత్రురాలిని రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వాసుదేవరావు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణంలో చోరీ

భామిని: మండల కేంద్రంలోని మద్యం దుకాణంలో బుధవారం రాత్రి చోరి జరిగింది. సుమారు రూ.30 వేలు విలువైన మద్యం బాటిళ్లను దొంగిలించారు. షట్టర్‌కున్న తాళాన్ని పగుల గొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. రోజులాగే క్యాష్‌యర్, సిబ్బంది షాపును గురువారం తెరిచేందుకు షాపు వద్దకు వచ్చారు. తాళం విరిగి ఉండడాని గమనించారు. తెరిచి చూసేసరికి నాలుగు బాక్స్‌ల మద్యం బాటిళ్లు దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బత్తిలి ఎస్ఐ ముకుందరావు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. రెండు రోజుల్లో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో స్థానికులకు కలవర పెడుతుంది.


వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ ముకుందరావు

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - పలాస

రాష్ట్ర ప్రభుత్వం జన్మభూమి-మా ఊరుకు వచ్చిన సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని రెండో వార్డు కౌన్సిలర్ బి.బాలమ్మ అన్నారు. గురువారం పద్మనాభపురంలో నిర్వహించిన జన్మభూమి గ్రామసభలో ఆమె మాట్లాడారు. టిడిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కావస్తున్నా పేదలకు ఇల్లు, రేషన్‌కార్డులు అందజేయలేదన్నారు. గత జన్మభూమిలో వచ్చిన దరఖాస్తులకు ఇప్పటివరకు పరిష్కారం చూపని అధికారులు, పాలకులు గ్రామసభలో సమస్యలు విన్నవిస్తే పరిష్కరిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సమస్యలపై నిలదీస్తే సంక్షేమ పథకాలు తొలగిస్తారన్న భయాన్ని విడనాడాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించలేని జన్మభూమి కార్యక్రమాలెందుకని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెనుదిరిగారు.

అనంతరం ఒకటో వార్డు మొగిలిపాడు సామాజిక భవనం వద్ద నిర్వహించిన జన్మభూమి-మా ఊరులో మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ ఎన్.రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జి.సూర్యనారాయణ, కౌన్సిలర్లు ఎల్.కామేశ్వరరావు, దున్న నిర్మల, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌నాయుడు, వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.



జన్మభూమి సభలో మాట్లాడుతున్న బాలమ్మ

బిల్లులు చెల్లించండి

ప్రజాశక్తి-మందస

ప్రజలు నిర్మిస్తున్న మరుగుదొడ్లకు తక్షణమే బిల్లులు చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ పలాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి దున్న వాసదేవు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని నారాయణపురం గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబమూ మరుగుదొడ్డి నిర్మించుకోవాలని చెబుతున్న అధికారులు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం విచారకరమన్నారు. బిల్లుల చెల్లింపుల్లో అలసత్వం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన స్వచ్ఛభారత్‌లో పాల్గొన్నారు. ఆయనతోపాటు టి.మధుసూదరావు, పి.మాధవరావు, గొరకల లోకనాథం, డి.ప్రకాశరావు, డి.సురేష్‌కుమార్ ఉన్నారు.

విద్యార్థినుల చేయూత

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

బ్రెయిలీ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు శరణ్య మనో వికాస కేంద్రంలో గురువారం మానసిక పిల్లలకు భోజనం పెట్టి బ్రష్‌లు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. విద్యార్థుల నిర్ణయాన్ని కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీరాములు, ఎం.ఆర్ జ్యోతి ఫ్రెడరిక్ అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థినులు మదీనా, విజయకుమారి, శ్రీదేవి, మాధురి తదితరులు పాల్గొన్నారు.

నేడు బూత్‌స్థాయి సమ్మేళనం

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గలోని గాలిమేడ వద్ద శుక్రవారం బిజెపి పలాస నియోజకవర్గ బూత్‌స్థాయి సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పైడి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభా ప్రాంగణాన్ని దీనదయాల్ ఉపాధ్యాయ ప్రాంగణంగా నామకరణం చేస్తున్నామన్నారు. సమ్మేళన కార్యక్రమానికి కేంద్ర మాజీ మంత్రి పురందేశ్వరి, తూముల వీర్రాజు హాజరవుతున్నారన్నారు. సమావేశంలో కణితి విశ్వనాథం, పూడి తిరుపతిరావు, సనపల సంపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



కిడ్నీ రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

కిడ్నీ రోగులకు మందులు పంపిణీ

ప్రజాశక్తి - పలాస రూరల్

మండలంలోని రంగోయి గ్రామంలో సుమారు 200 మంది కిడ్నీ రోగులకు అమెరికాలోని తెలుగు వైద్య బృందం సభ్యులు కె.కుమార్, ఆకుల రవి గురువారం ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఉద్దానం ఆరోగ్య పరిరక్షణ కమిటీ కన్వీనర్ మద్దిల రామారావు, అంబటి ఆనందరావు మాట్లాడుతూ ఉద్దానం ప్రజలు కిడ్నీ వ్యాధితో మరణిస్తుంటే ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కిడ్నీ రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయాలని, డయాలసిస్ చేయించుకుని మృతిచెందిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- పలాస రూరల్

వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణంతోనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని, ఇవి తప్పనిసరి అని ఎంపిడిఒ పి.సూర్యానారాయణ అన్నారు. మండలంలోని రంగోయి గ్రామంలో గురువారం వ్యక్తిగత మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఆరుబయట మలవిసర్జన చేయడంతో గ్రామం అపరిశుభ్రంగా ఉండడంతోపాటు ప్రజలు అనారోగ్యానికి గురవుతారన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.కోట్లు వ్యచ్చిస్తోందన్నారు. కార్యక్రమంలో పలాస ఎంఇఒ పైల కృష్ణప్రసాద్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ పోతనపల్లి బాలరాజు, పంచాయతీ కార్యదర్శి యాదవరాజు, సిఆర్‌పి కె.దుర్యోధన, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వెనుకబాటుతోనే వలసలు

రూ.2,500 ఫించన్‌తో పాటు డయాలసిస్ కేంద్రాలు, ఏడు చోట్ల ఆర్‌ఒ ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. ఉద్దానం కిడ్నీ బాధితుల కోసం రూ.10 కోట్లు మంజూరు చేస్తామన్నారు. వారి కోసం ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో ప్రతిష్టాత్మకమైన వాటర్‌ప్లాంట్లను నెలకొల్పుతామని చెప్పారు. కళింగపట్నంలో రూ.43 కోట్లతో జెట్టీ నిర్మిస్తున్నామని, క్లబ్ మహీంద్ర రిసార్ట్స్ నిర్మాణం చేపడుతుందని తెలిపారు. అరసవల్లి అభివృద్ధికి కమిటీ వేశామని, నివేదిక వచ్చిన తర్వాత పనులు చేపడతామని చెప్పారు. శ్రీకాకుళం నగరానికి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు.

ఉద్యమంగా మరుగుదొడ్ల నిర్మాణం

రాష్ట్రవ్యాప్తంగా మరుగుదొడ్ల నిర్మాణాన్ని ఉద్యమస్ఫూర్తిగా చేపడుతున్నామని, ప్రతిఒక్కరూ మరుగుదొడ్లు నిర్మించుకుని, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మరుగుదొడ్ల నిర్మాణంలో శ్రీకాకుళం జిల్లా రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల్లో మూడో స్థానంలో ఉందని తెలిపారు. జిల్లాలో 4,09,204 గృహాలు ఉంటే, 1,71,624 కుటుంబాలు మాత్రమే మరుగుదొడ్లు నిర్మించుకున్నాయని చెప్పారు. జిల్లాలో అందరూ మరుగు దొడ్లు నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. మార్చి 31 తర్వాత మరుగుదొడ్లు నిర్మించలేదనడానికి వీల్లేదన్నారు.



డ్వాక్రా మహిళలకు లింకేజీ రుణాలను అందిస్తున్న చంద్రబాబునాయుడు

ఇచ్ఛాపురంపై వరాల జల్లు

జన్మభూమి సభలో ఇచ్ఛాపురం నియోజకవర్గంపై ముఖ్యమంత్రి వరాల జల్లు కురిపించారు. ఇచ్ఛాపురంలో తాగునీటి సౌకర్యం, డంపింగ్ యార్డుల నిర్మాణం, రోడ్లు, పార్కుల అభివృద్ధి, అరకభద్ర వద్ద బాహుదా నదిపై వంతెన నిర్మాణం, మత్స్యకారుల కోసం శీతల గిడ్డంగులను ఏర్పాటు చేస్తామన్నారు. ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి పార్కును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో మూడంచెల డ్రయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. 200 జనాభా ఉంటే ఇంకుడుగుంతలు ఏర్పాటు, ఐదు వేల లోపు జనాభా ఉంటే ఓపెన్ డ్రయినేజీ వ్యవస్థ, ఐదు వేల పైబడి జనాభా ఉండే చోట్ల భూగర్భ డ్రయినేజీ ఏర్పాటుకు శ్రీకారం చుడతామన్నారు.

మొదటి పేజీ తరువాయి

మరుగుదొడ్లపై అవగాహన కల్పించాలి

జిల్లాలో ఎవరైనా మరుగుదొడ్డి నిర్మించుకోకపోతే, మీ ఇంటికొచ్చి రాత్రీ పగలు బస చేసి, మరుగుదొడ్డి కట్టుకున్న తర్వాతే అమరావతికి వెళ్తానన్నారు. అధికారులు మరుగుదొడ్ల నిర్మాణాలతో కలిగే లాభాలపై అవగాహన కల్పించి, ఒప్పించి నిర్మించుకునేలా చూడాలన్నారు. పరిశుభ్రతను ప్రాథమిక హక్కుగా భావించాలని జనాలకు చెప్పాలన్నారు. మరుగుదొడ్డి నిర్మించుకోవడంతో పాటు వాటిని ఉపయోగించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. జన్మభూమి సభల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యేలు, నోడల్ అధికారులు, జన్మభూమి కమిటీ సభ్యులకు పరీక్ష ఉంటుందని, వారు పాస్ కావాల్సి ఉందని నవ్వుతూ చెప్పారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రవిబాబు ఆధ్వర్యాన జన్మభూమి గ్రామసభను నిర్వహించారు. కార్యక్రమంలో చివరిలో అందరితో ముఖ్యమంత్రి ప్రతిజ్ఞతో చేయించారు.

కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పితాని సత్యనారాయణ, రాష్ట్ర రవాణశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, విద్యుత్‌శాఖ మంత్రి కిమిడి కళా వెంకటరావు, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్, కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, జాయింట్ కలెక్టర్ కె.వి.ఎన్ చక్రధరబాబు, ఎఎంసి చైర్మన్ సాడి సహదేవ్‌రెడ్డి, బి.కురయ్య, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు గౌతు శిరీష, జెడ్‌పిటిసి సభ్యులు అంబటి లింగరాజురెడ్డి, రమేష్, చాట్ల తులసీదాస్ రెడ్డి, నర్తు నరేంద్రయాదవ్, కాళ్ల ధర్మారావు, బుద్దాల నిర్మలారెడ్డి, జగన్నాథరెడ్డి, ఇతర నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

23న స్కీమ్ వర్కర్ల సమ్మె

చేశారు. ఈ సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని ఇందిరానగర్ కాలనీలో గల సిఐటియు జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీమ్‌వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.18 వేలు, కనీస పింఛన్ రూ.మూడు వేలు చెల్లించాలన్నారు. కార్మిక చట్టాలను అనుసరించి పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. 2018-19 బడ్జెట్‌లో ప్రభుత్వ పథకాలకు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ఉపాధి హామీ, ఆశా, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, సర్వశిక్షా అభియాన్, వెలుగు, సెర్ఫ్, బాల కార్మికుల ప్రాజెక్టు, ఎపి పల్స్ తదితర పథకాలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ చేపడుతున్న సమ్మెలో భాగంగా జిల్లాలో ఈనెల 12న స్కీమ్‌వర్కర్ల జిల్లా సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20, 21 తేదీల్లో జీపు జాతాను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. 23న సమ్మె చేపట్టి, అన్ని మండల కేంద్రాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.హిమప్రభ, కె.నాగమణి, ఎ.మహాలక్ష్మి, కె.ఆదిలక్ష్మి, బి.స్వప్న, ఎం.ఆదినారాయణమూర్తి, ఎ.సత్యం, సి హెచ్.రామ్మూర్తినాయుడు, ఎన్.షణ్ముఖరావు, డి.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయట మలవిసర్జన అనర్థం


శ్రీకాకుళం అర్బన్... ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆరుబయట మలవిసర్జన అనర్థదాయకమని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విద్యార్థులు కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.బాబూరావు పిలుపు నిచ్చారు. గురువారం జన్మభూమి-మాఊరు ఐదో విడత కార్యక్రమంలో భాగంగా డిగ్రీ కళాశాల ఆవరణలో స్వచ్ఛాంధ్రప్రదేశ్ పేరిట పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుతామని విద్యార్థులు ప్రతిజ్ఞ పూనారు. నగరంలోని శాంతినగర్ కాలనీ, హడ్కో కాలనీ, బలగ, రిమ్స్ ఆస్పత్రి, రామకృష్ణానగర్ ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.లచ్చన్న, ఐక్యూఎసి కో-ఆర్డినేటరు డాక్టర్ ఎన్ఎస్ఎన్ స్వామి, ఎన్‌సిసి అధికారి డాక్టర్ వై.పోలినాయుడు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ భాస్కరరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ : ఆరుబయట మలవిసర్జన వల్ల పరిసరాల పరిశుభ్రత దెబ్బతిని ప్రమాదకర వ్యాధుల భారిన పడే అవకాశం ఉందని రిమ్స్ డైరెక్టర్ ఎ.కృష్ణవేణి అన్నారు. జన్మభూమి.. మాఊరు కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా రిమ్స్ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. రిమ్స్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బలగ కూడలి వరకు కొనసాగింది. ర్యాలీలో ఆర్ఎంఒ బి.అప్పలనాయుడు, విభాగం సహాయ ప్రొఫెసర్ బి.నాగేంద్రనాయుడు, శరత్‌బాబునాయక్, కె.మోక్షానానంద్, ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం పాల్గొన్నారు.

ఆమదాలవలస : బహిరంగ మలవిసర్జన నిర్మూలనే అందరి ధ్యేయమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.బి.గోపాలరావు అన్నారు. జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం జూనియర్ కళాశాల విద్యార్థులు కళాశాల నుంచి గాంధీ విగ్రహం వరకు బహిరంగ మలవిసర్జన నిర్మూలించాలని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ రవిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.


శ్రీకాకుళంరూరల్... ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు




శ్రీకాకుళం టౌన్... ర్యాలీ నిర్వహిస్తున్న రిమ్స్ విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని ప్రతిగ్రామమూ ఒడిఎఫ్‌గా మారాలని డిప్యూటీ డిఇఒ అబోతుల ప్రభాకరరావు అన్నారు. మండలంలోని పెదపాడులో స్వచ్ఛతసేవ, స్వచ్ఛసిక్కోల్‌లో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్లపై ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆయనతో పాటు హెచ్ఎం కాసులబాబు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. కళ్లేపల్లిలో ఎంఇఒ జి.కృష్ణారావు, పెదపాడు ఎపి సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వై.యశోధ లక్ష్మి అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సభ్యులు శ్రీనివాసరావు, మాధవిలత, అనురాధ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మీరా అర్హతను నిర్ణయించేది?

ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి


ఎమ్మెల్యే లక్ష్మీదేవి

శ్రీకాకుళం అర్బన్: ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు అర్హత నిర్ణయించేది వైసిపి నాయకులకు ఉన్న అర్హత ఏమిటని శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ప్రశ్నించారు. గురువారం అరసవల్లిలో విలేకరులతో మాట్లాడారు. అర్హత గురించి మాట్లాడుతున్న వారంతా నాయకులు ఎలా అయ్యారో? గుర్తు చేసుకోవాలని సూచించారు. అర్హతలను నిర్ణయించేది ప్రజలన్నారు. అర్హతతోనే జన్మభూమి గ్రామసభల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరవుతూ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కృషి చేస్తున్నారన్నారు. విమర్శలు మాని ప్రజా సమస్యలపై మంచి సూచనలు చేయాలని హితవు పలికారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే సిబిఐ కేసులో నిందితునిగా ఉన్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు తమపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీలో చురుగ్గా పనిచేస్తున్న నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్‌తో పాటు ఇతర నాయకులపైనా బురద జల్లి ప్రజల్లో అపోహలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి, అవినీతిపైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు.


వృద్ధులతో మాట్లాడుతున్న శ్యామలాదేవి

వృద్ధాశ్రమంలో సౌకర్యాలపై ఆరా

శ్రీకాకుళం సిటీ: నగరంలోని ప్రశాంతి వృద్ధాశ్రమంలో సౌకర్యాలపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యామలాదేవి ఆరా తీశారు. గురువారం ప్రశాంత వృద్ధాశ్రమంలో తనిఖీలు చేసిన ఆమె అక్కడ నిర్వాహకులు అందిస్తున్న సేవలను వృద్ధులతో మాట్లాడి తెలుసుకున్నారు. వైద్యం, ఆహార సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. 72 మంది వయోవృద్ధులు ఆశ్రయం పొందుతున్నారని రికార్డులను పరిశీలించి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలున్నా, తనకు నేరుగా తెలియజేయాలని, సంస్థ ద్వారా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. అనంతరం మెమరా మనోవికాస కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందుతున్న వైద్యం, ఆహార సౌకర్యాలు, బాలుర స్థితిగతులను తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న కంప్యూటర్ శిక్షణ, స్పీచ్ థెరపీపై నిర్వాహకులు శేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు.

అంధ ఉపాధ్యాయుని ప్రతిభ

ప్రజాశక్తి- ఆమదాలవలస

లాలుబ్రెయిలీ జయంతి సందర్భంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఈ నెల 2వ తేదీన నిర్వహించిన జిల్లాస్థాయి పాటల, వక్తృత్వ పోటీల్లో జొన్నవలస ప్రభుత్వ పాఠశాల అంధ ఉపాధ్యాయులు బగాన వెంకటరమణమూర్తి తన ప్రతిభ కనపర్చారు. పాటల, వృక్తృత్వ రెండు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈయనను ఎంఇఒ చంద్రశేఖర్, సామాజిక కార్యకర్త సువ్వారి మురళీధరరావు తదితరులు అభినందించారు. భవిష్యత్తులో మరింత రాణించాలని ఆకాంక్షించారు.

పారిశ్రామికవాడ అభివృద్ధికి నిధులు విడుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆమదాలవలస పారిశ్రామికవాడ అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని ప్రభుత్వ విప్ కూన రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పారిశ్రామికవాడలో రోడ్లు, తాగునీటి సరఫరా, బ్యాంకు, పోస్టాఫీసు, సోషల్ ఫారెస్టు తదితరవి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో పొందూరు మండలం లోలుగులో రూ.34 లక్షలు, రాపాకలో రూ.27.50 లక్షలు, ఆమదాలవలస మండలం చీమలవలసలో రూ.27.50 లక్షలతో పశువైద్య శాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

'జన్మభూమి'ల్లో ఫిర్యాదుల వెల్లువ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పలు డివిజన్లలో రుణాలు ఇప్పిస్తామని, ఇళ్ల ఇప్పిస్తామని కొందరు డివిజన్ ఇన్‌ఛార్జిలు పర్సంటేజీల పేరుతో దండుకున్నారని, అయినా ఇంతవరకు రుణాలు, ఇళ్ల మంజూరు కాలేదని శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండలక్ష్మీదేవికి పలువురు ఫిర్యాదు చేశారు. గురువారం నగరంలోని రెల్లి వీధి, పుణ్యపు వీధి, పాండురంగ వీధి, ఇప్పిలివారివీధి, బాకర్‌సాహెబ్‌పేట, మండలవీధిల్లోని పలు డివిజన్లలో జన్మభూమి -మాఊరు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు బాకర్‌సాహెబ్‌పేట డివిజన్ పరిధిలో స్థానికులు ముక్తకంఠంగా ఫిర్యాదు చేశారు. డివిజన్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న టిడిపి నాయకులు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, కాపు రుణాలు ఇప్పిస్తామని చెప్పి దరఖాస్తులు సేకరించారని, దరఖాస్తు చేసుకున్నప్పుడే పర్సంటేజీలు వసూలు చేశారని ఫిర్యాదు చేశారు. ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో ఆన్‌లైన్ చేయిస్తామని నమ్మబలికి డబ్బులు దండుకున్నారని చెప్పుకొచ్చారు. స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఎమ్మెల్యే


శ్రీకాకుళం అర్బన్ మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీదేవి

ఖంగుతిన్నారు. అటువంటి వ్యక్తులు ఎవరైనా చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ జి.వెంకటేశ్వరరావు, సహాయక కమిషనర్ ఎం.జీవరత్నం, నగర ప్రణాళికా విభాగం అధికారి దేవకుమార్, నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, టిడిపి నాయకులు చిట్టి నాగభూషణం, ఎస్.వి.రమణ మాదిగ, పాల్గొన్నారు. అనంతరం డివిజన్ల పరిధిలో ఐసిడిఎస్‌ల్లో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అలాగే సంక్రాంతి చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు.

కళ్లేపల్లిలో నిలదీత...

కళ్లేపల్లిలో నిర్వహించి జన్మభూమి కార్యక్రమంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఇచ్చి 20 రోజులైనా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమవ్వలేదని అధికారులను, ప్రజాప్రతినిధులను నిలదీశారు. దీనిపై స్పందించి మాజీ ఎఎంసి చైర్మన్ శ్రీనివాసరావు నువ్వు ఇచ్చిన రైస్‌మిల్లుకు బ్యాంకు గ్యారెంటీ కానందున కొంత జాప్యం జరిగిందని, త్వరలోనే నీడబ్బులు ఖాతాలో జమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.అసిరన్న, ఎంపిపి జి.జగన్నాధరావు, వైస్ ఎంపిపి జి.అసిరప్పడు, ఎంపిడిఒ బొడ్డేపల్లి శైలజ పాల్గొన్నారు.

ఆమదాలవలస : అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత హామీని చ్చారు. జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో గురువారం 19, 23 పాత ఆమదాలవలస, వెంకయ్యపేట గ్రామాల్లో పాల్గొన్నారు. మేనేజర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు చిన్నబాబు, బొడ్డేపల్లి ఏకాశమ్మ, పి.విద్యాసాగర్, ఎఇ శ్రీనివాసరావు, మాధవి, సిడిపిఒ నళినిదేవి పాల్గొన్నారు.

మండలంలో...

మండలంలో చిట్టయ్యవలస, గాజులకొల్లివలస, నెల్లిపర్తి, వెదుళ్లవలస గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిడి పంచాది రాధ, ఎంపిడిఒ హబీబ్, తహశీల్దార్ బాబ్జీరావు, సర్పంచులు సత్యవతి, సన్యాసి, జగదీశ్వరి, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : కాజీపేటలో నిర్వహించిన జన్మభూమిలో రేషన్ కార్డులు, చంద్రన్న బీమా ప్రొసీడింగ్స్ కాపీలను ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, చిట్టిమోహన్, ఎంపిటిసి బాబూరావు, ఎస్.రమణయ్య పాల్గొన్నారు. పెదపాడులో నిర్వహించిన గ్రామసభలో అర్హులకు సంక్షేమ పథకాలను మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్ అందజేశారు. బి.కామరాజు, తహశీల్దార్ కార్యాలయ సూపరింటిండెంట్ రాంబాబు పాల్గొన్నారు.

కొర్లాంలో రసాభాస

గార : సమస్యలు పరిష్కరించకుండా ఎందుకు జన్మభూమి కార్యక్రమమని కొర్లాం పంచాయతీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం సర్పంచ్ పీస శ్రీహరి అధ్యక్షతన జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాము ఉపాధి పనులు చేసి ఆరు నెలలవుతున్నా, ఇంతవరకు డబ్బులు చెల్లించలేదని కూలీలు నిలదీశారు. సాగునీరు, తాగునీటి లెక్కలే తప్ప పూర్తిస్థాయిలో అందడం లేదని పీస సుందరం, రమణమూర్తి తదితరులులు ఆక్రందన వ్యక్తం చేశారు. అర్హులైనా వితంతు, వృద్ధాప్య పింఛన్లు అందించడం లేదని కొమరవానిపేటకు చెందిన గణగళ్ల


గార... కొర్లాంలో నిలదీస్తున్న ప్రజలు

అమ్మెరు, తదితరులు అధికారులను నిలదీశారు. ఎంపిడిఒ పి.కాం తారావు మాట్లాడుతూ ఉపాధి, ఇంకుడు గుంతల బిల్లులు త్వరలో అందజేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


డబ్బుల కొరత... ఖాతాదారుల అవస్థలు

ఆమదాలవలస: పట్టణంలోని పలు బ్యాంకుల్లో డబ్బుల కొరత ఏర్పడింది. గురువారం స్టేట్‌బ్యాంకులో డబ్బుల కొరత ఉందని నో క్యాష్‌బోర్డులు పెటారు. ఖాతాదారులు పండగ ముందు డబ్బుల కోసం బ్యాంకుల్లో క్యూకట్టి డబ్బులు లేకపోవడంతో నిరాశతో తిరిగి వెళ్తున్నారు. బ్యాంకుల్లో డబ్బులు లేకపోతే మా బాధలు ఎవరితో చెప్పుకోవాలని లబోదిబోమంటున్నారు. ఏడాది కిందట నోట్ల రద్దుతో ఇబ్బందులు తేరుకోకముందే మళ్లీ బ్యాంకుల్లో డబ్బులు లేక మూడు రోజుల నుంచి బ్యాంకుల చుట్టు తిప్పడం దారుణ మని వాపోతున్నారు. ఈ విషయమై మేనేజర్ వేణుగోపాల రావును వివరణ కోరగా, వారం రోజుల నుంచి డబ్బులు కొరత వాస్తవమేనని, ఖాతాదారులకు కొంత లిమిట్‌లో డబ్బులు ఇచ్చినప్పటికీ గురువారం నాటికి పూర్తిస్థాయిలో కొరత ఏర్పడిందని తెలిపారు. విత్‌డ్రాలే తప్ప డిపాజిట్లు రాకపోవడంతో మరింత డబ్బులు కొరత ఉంటుందన్నారు.



తిరుగుమొఖం పడుతున్న ఖాతాదారులు

ప్రజాశక్తి
www.prajasakti.com
శ్రీకాకుళం
శుక్రవారం
5-1-2018



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన పోలీసులు

నగరంలో ట్రాఫిక్ కష్టాలు

- నియంత్రణలో పోలీసులు విఫలం
- పండగ వేళ ప్రజలకు ఇబ్బందులు
- వస్త్ర వ్యాపారులకు వత్తాసు
- నిబంధనల పేరుతో సామాన్యులపై ఈ-చలానా బాదుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నగరంలో ట్రాఫిక్ కష్టాలు సరామామూలుగా మారాయి. మిగతా రోజుల్లో కాకుండా జనవరి నెల ఆరంభం నుంచి 18వ తేదీ వరకు నగరం వాహనాలతో కిక్కిరిసిపోవడం ప్రతి ఏడాదీ సర్వ సాధారణం. గత మూడేళ్లలో పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ నగరంలో ఏర్పాటు కావడంతో రద్దీ ఏడాదికేడాది విపరీతంగా పెరుగుతూ వస్తోంది. సంక్రాంతి సమయాల్లో రద్దీ మరింత పెరుగుతూ ఉంది. సంక్రాంతి సమయంలో రద్దీగా ఉండే జిటి రోడ్డు, కళింగ రోడ్లలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో పోలీసులు విఫలమయ్యారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకోకుండా షాపింగ్ మాల్స్, ప్రముఖుల వస్త్ర వ్యాపారులకు అనుకూలంగా ట్రాఫిక్ పోలీసులు నిర్ణయాలు తీసుకుంటుండడంతో సామాన్యులు, నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిటి రోడ్డులోని షాపింగ్ మాల్స్, ప్రముఖ వస్త్ర వ్యాపారులు ప్రతి నెలా ఇచ్చే మామూళ్లతో పాటు సంక్రాంతి బోనస్ పేరుతో భారీగా ముట్ట జెప్పతుండడంతో పోలీసులు మిన్నకుండి పోతున్నారు. ట్రాఫిక్ నిబంధనల పేరుతో సామాన్య వాహన చోదకులు, ఆటోలపై ప్రతాపం చూపిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించారని ఈ-చలానాలు విధిస్తూ భారీగా జరిమానా వసూలు చేస్తున్నారు. సెంటర్ పార్కింగ్‌లో వాహనాలు నిలపకుండా జిటి రోడ్డులోని వ్యాపారులు వారి షాపులు ఎదురుగా వాహనాలు నిలుపుతున్నా వారిని పోలీసులు వారించడం లేదు. నిబంధనలు పేరుతో సామాన్యులపై ఈ-చలనా అస్త్రాన్ని ఉపయోగిస్తున్నారు.

ప్రయోజనం లేదు

జిటి రోడ్డుకు అచ్చిరాని సెంటర్ పార్కింగ్ వ్యవస్థను ఆరు నెలలుగా అమలు చేస్తున్నా ఒరిగే ప్రయోజనం ఏమీ లేదని గతంలోనే నిరూపించ బడింది. ఈ వ్యవస్థ వల్ల ట్రాఫిక్ నియంత్రణ సాధ్యం కాలేదు, సరేకదా సమయాభావం తప్పడం లేదు. దీని వల్ల సానుకూల ఫలితాలు లేక పోయినా షాపింగ్‌మాల్ యాజమాన్యం ఒత్తిడితో కొనసాగిస్తున్నారు. దీనిపై నగర వాసుల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నా పోలీసులు పట్టనట్లుగా వ్యవహరించారు. ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, ఆటోలు సెంటర్ పార్కింగ్‌లోకి అనుమతించడం ద్విచక్రవాహన దారులు, పాదచారులు ప్రమాదాలు బారిన నిత్యం పడుతున్నారు. ప్రమాదాలు సంఖ్య విపరీతంగా పెరిగింది. రెండేళ్ళ క్రితం సెంటర్ పార్కింగ్ తో ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని పోలీసులు చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో దాన్ని ఎత్తేశారు.


ద్విచక్ర వాహనాల పార్కింగ్


అస్తవ్యస్తంగా ఆటోల పార్కింగ్

చర్యలు సూన్యం..

నగరంలో షాపింగ్ మాల్స్ ఏర్పాటు అయిన తర్వాత మరోమారు సెంటర్ పార్కింగ్ విధానాన్ని తెరపైకి తెచ్చి సామాన్యులను ఇబ్బందులుకు గురిచేసి వస్త్రవ్యాపారులకు సహకరిస్తున్నారు. సెంటర్ పార్కింగ్‌లో వినియెగదారలు విహనాలకు అవకాశం లేకుండా జిటీ రోడ్‌లో ఉన్న షాపులు యజమానులు కార్లు, అందులో సిబ్బంది ద్విచక్ర వాహనాలును మాత్రమే పార్కింగ్ చేసుకునేందుకు ఎక్కువగా ఉపయోగ పడుతుంది. దీంతో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు పురుగుతున్నాయి.

సంక్రాంతి హడావుడి ప్రారంభమై వారం రోజులు గడుస్తోంది. రద్దీ పెరిగినా వారం రోజుల పాటు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు ఇన్ని రోజులకు కళ్లు తెరిచారు. జిటి రోడ్‌లో నాలుగు, మాడు చక్రాల వాహనాలను జిటీ రోడ్‌లోకి అనుమతించబోమని బారికేడ్లు బారికేడ్లు ఏర్పాటు చేశారు. పార్కింగ్‌కు ఏడురోడ్లు కూడలి వైపు, ఎన్‌టిఆర్ నగరపాలక సంస్థ హైస్కూల్ మైదానం, సూర్యమహల్ కూడలి వైపు డైమండ్ పార్క్ వద్ద వాహనాలు నిలపాలని హెచ్చరిక బోర్డులను జిటి రోడ్డులో ఏర్పాటు చేశారు. బారికేడు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా సెంటర్ పార్కింగ్‌లో కార్లు, ఆటోలను నిలుపుతున్నారు. లగేజీ ఆటోలను పోలీసులు విడిచి పెడుతున్నారు. దీంతో రద్దీ పెరిగి సెంటర్ పార్కింగ్‌తో ఇరుకుగా రోడ్లు మారి వినియెగదారులు, పాదచారులు, సందర్శకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీన్ని పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. సాధారణ రోజుల్లోనే సెంటర్ పార్కింగ్ వల్ల తీవ్ర ఇబ్బంది పడుతుంటే రద్దీ రోజుల్లో దీన్ని తొలగించకుండా కొనసాగించడం మరిన్ని ఇబ్బందులకు గురికాక తప్పదని నగరవాసులు, ద్విచక్రవాహన చోదకలు వాపోతున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో స్పష్టమైన విధానం అవలంబించడంలో పోలీసులు విఫలమయ్యారు.


సెంటర్ పార్కింగ్‌లో కార్లు, ఆటోలు

సిఎం పర్యటనలో పదనిసలు

1. హెలీప్యాడ్ వద్ద వేసిన టెంట్‌లో కూర్చొన్న మంత్రులు అచ్చెన్నాయుడు, కళా వెంకటరావు పక్కపక్కనే కూర్చొన్నా, చాలాసేపటి వరకు మాట్లాడుకోలేదు.
2. మంత్రులు, టిడిపి నాయకులు కుర్చీలో కూర్చోగా, కలెక్టర్ ధనంజయరెడ్డి నిల్చోవడం కనిపించింది.
3. సిఎం చంద్రబాబునాయుడు జన్మభూమి ప్రతిజ్ఞ చేస్తున్న సమయంలో పలుమార్లు తడబడ్డారు. ప్రారంభంలో నవ్యాంధ్ర బదులుగా స్వర్ణాంధ్ర అని చెప్పి, తర్వాత మళ్లీ నవ్యాంధ్ర అంటూ ప్రారంభించారు.
4. చిన్నారి లాబాల రిషిత ప్రసంగించిన తీరుకు సిఎంతో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు ముగ్ధులై హర్షధ్వానాలు పలికారు.
5. సెల్‌ఫోన్లపై ఉన్న మక్కువ మరుగుదొడ్ల నిర్మాణంపై లేదంటూ మహిళలను ఉద్దేశించి సిఎం చమత్కరించారు.
6. స్టాల్స్ పరిశీలన సందర్భంగా మీడియా ప్రతినిధులు, పార్టీ నేతలు ఒక్కసారిగా చొరబడడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది.

ఆకట్టుకున్న చిన్నారుల ప్రసంగం


సభలో మాట్లాడుతున్న విద్యార్థిని

జన్మభూమి గ్రామసభలో ఇద్దరు చిన్నారులు చేసిన ప్రసంగం అందరినీ కట్టి పడేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఇచ్ఛాపురం మన్సిపాల్టీకి చెందిన ఎల్.ఇంద్రాణి, శ్రీకాకుళంకు చెందిన రిషిత చేసిన ప్రసంగం సభావేదిక వద్ద ఉన్న నాయకులు, అశేష ప్రజానీకాన్ని మంత్రముగ్ధుల్ని చేసింది. మూడో తరగతి చదువుతున్న రిషిత సిఎం చేస్తున్న అభివద్ధి కార్యక్రమాలను గుక్క తిప్పుకోకుండా వివరించడంతో చంద్రబాబు ఆశీర్వదిస్తూ, తక్షణమే రూ.50 వేల నగదును చిన్నారి తల్లిదండ్రుల బ్యాంకు అకౌంట్‌కు డిపాజిట్ చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. రిషిత తల్లిదండ్రులు ప్రసన్న, ప్రదీప్ శ్రీకాకుళం, జి.సిగడాంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. గ్రామసభలో చిన్నారిని సిఎం ప్రత్యేకంగా అభినందించడం హైలెట్‌గా నిలిచింది.


సిఎంకు స్వాగతం పలుకుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


నృత్యకారులతో సిఎం చంద్రబాబు, అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు, తదితరులు

సిఎంకు ఘన స్వాగతం

- రూ.342.72 కోట్ల ఉపకరణాలు పంపిణీ
- చిన్నారి రిషితకు రూ.50 వేల నజరానా

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి/ఇచ్ఛాపురం/సోంపేట/కంచిలి

ఇచ్ఛాపురం మున్సిపాల్టీ పరిధిలోని సురంగి రాజావారి మైదానంలో గురువారం నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర రవాణశాఖ మంతి కింజరాపు అచ్చెన్నాయుడు, విద్యుత్‌శాఖ మంత్రి కిమిడి కళా వెంకటరావు, జెడ్‌పి చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, ఎస్‌పి తివిక్రమవర్మ సిఎంకు ఘన స్వాగతం పలికారు. హెలీప్యాడ్ నుంచి ఇచ్ఛాపురం మెయిన్ రోడ్డు మీదుగా సిఎం రోడ్ షో కొనసాగింది. భవనాలపై నుంచి జనం చంద్రబాబును ఆసక్తిగా చూశారు. రోడ్డుకిరువైపులా బారులు తీరి చంద్రబాబుకు చేతులూపుతూ స్వాగతం పలకగా, వాహనంపై నుంచే చంద్రబాబు వారికి అభివాదం చేశారు.

రూ.342.72 కోట్ల ఉపకరణాలు పంపిణీ

జన్మభూమిలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా రూ.342.72 కోట్ల ఉపకరణాలను లబ్ధిదారులకు అందజేశారు. జిల్లాలోని డ్వాక్రా మహిళా సంఘాలకు రూ.108 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. డ్వాక్రా మహిళలకు స్త్రీ నిధి ద్వారా రూ.36 కోట్ల చెక్కును, రూ.12.54 కోట్ల చంద్రన్న బీమా స్కాలర్‌షిప్‌లు, రూ.176 కోట్ల బిసి కార్పొరేషన్ రుణాలు, రూ.24.14 కోట్ల ఎస్‌సి కార్పొరేషన్ రుణాలు, భూమి కొనుగోలు పథకం కింద రూ.6.18 కోట్ల రుణాలు అందజేశారు. వీటితో పాటు పలువురు గిరిజనులకు కొండపోడు పట్టాలు, పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను అందజేశారు.

స్టాల్స్ పరిశీలన

సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిశీలించారు. ఫైబర్ నెట్, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ, ఉద్యానవనశాఖ, ఐసిడిఎస్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్, మత్స్యశాఖ, వెలుగు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, పంచాయతీశాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రం, పట్టణ పేదరిక నిర్మూలన ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన స్టాల్, సర్వశిక్షా అభియాన్, జిల్లా పోలీసు శాఖ స్టాల్, వ్యవసాయశాఖ ఆధ్వర్యాన రైతు రథం ట్రాక్టర్ల పంపిణీ స్టాల్స్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. యువకులతో వాలీబాల్ ఆడి సందడి చేశారు. చిన్నారులతో కోలాటం ఆడి అక్కడున్న వారందరిలో ఉత్సాహం నింపారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న చంద్రబాబు


జన్మభూమి-మా ఊరు సభలో పాల్గొన్న ప్రజలు


స్టాల్స్‌లో రైతుల ఉత్పత్తులను పరిశీలిస్తున్న సిఎం

సిఎంకు విన్నపాలు

జన్మభూమి కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పలు సంఘాల నాయకులు, ప్రజలు వినతులు అందజేశారు. ఎపిటిఎఫ్ నాయకులు అనంతాచార్యులు, శోభన్‌బాబు, శ్రీరాం బిసాయిలు, ఎపిసిఎపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు తదితరులు సిపిఎస్ విధానం రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఉద్దానం అభివృద్ధి వేదిక సభ్యులు ఎస్.రామారావు, దేవరాజు, దాసు తదితరులు కిడ్నీ వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలని కోరారు. మున్సిపాల్టీలోని సమస్యలపై కాళ్ల ధర్మారావు, చాట్ల తులసీదాస్‌రెడ్డి వినతిపత్రం అందించారు. వీరితోపాటు అగ్రిగోల్డ్ బాధితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రికి వినతిని అందజేశారు.


రైతు రథం పత్రాలను అందజేస్తున్న చంద్రబాబు

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ముందస్తు అరెస్టులు

కొత్తూరు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇచ్ఛాపురం వచ్చిన నేపథ్యంలో పోలీసులు పలువురిని ముందస్తు అరెస్టులు చేశారు. బోయ, వాల్మీకిలను ఎస్‌టిల్లో చేర్చొద్దని గిరిజనుల పోరాటం నేపథ్యంలో ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిక కుమార్‌ను సీతంపేట మండలం పూతికవలసలోని ఆయన ఇంటి వద్దనే పోలీసులు గురువారం ముందస్తు అరెస్టు చేశారు. ఇరపాడు నిర్వాసితులు, వైసిపి కార్యకర్తలు కె.సంజీవరావు, సూర్యనారాయణను అరెస్ట్ చేసి కొత్తూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బెంతు ఒరియా నాయకులు అరెస్టు

కంచిలి : సిఎం సభకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న సిపిఐ, బెంతు ఒరియా నాయకులను కంచిలి మండలంలో పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. కంచిలికి చెందిన సిపిఐ నాయకులు సాలిన నారాయణస్వామి, జాజిమొగ్గల తరిణి, బెంతు ఒరియా నాయకులు భగవాన్ బిసాయి తదితరులను అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఎటువంటి ఆందోళనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ అరెస్టులు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కవిటి : మండలంలోని బల్లిపుట్టుగ, వరక గ్రామాలకు చెందిన బెంతు ఒరియా సంఘం నాయకులు రజనీకుమార్ దొళాయి, శ్యాంపురియాలను ఎస్ఐ చిన్నంనాయుడు గురువారం ఉదయం అరెస్టు చేశారు. గతేడాది జన్మభూమి కార్యక్రమంలో బెంతు ఒరియాలు నిరసన తెలిపిన నేపథ్యంలో ఆ సంఘం నాయకులను ముందస్తుగా అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో ఉన్న రజనీకుమార్ దొళాయి, శ్యాంపురియాలను వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పూడి నేతాజీ, నాయకులు భాస్కరరావు, జయప్రకాష్, కె.ప్రకాష్, ఇచ్ఛాపురం వైద్యులు ఉలాల శేషు యాదవ్, తదితరులు పరామర్శించారు. బెంతు ఒరియాల పోరాటానికి అండగా ఉంటామన్నారు.


కవిటి: పోలీస్ స్టేషన్‌లో ఉన్న బెంతు ఒరియా నాయకులు

బ్రిటీష్ పాలనను తలపిస్తోంది

రాష్ట్ర ప్రభుత్వ పాలన బ్రిటీష్ పాలనను తలపిస్తోందని బెంతు ఒరియా సంఘం నాయకులు రజనీకుమార్ దొళాయి, శ్యాంపురియా అన్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో వారు విలేకరులతో మాట్లాడారు. బెంతు ఒరియాల సమస్యలను పరిష్కరించాలని పదేపదే కోరుతున్నా పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం, తమను అక్రమంగా అరెస్టులు చేయడం దారుణమన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరడం తప్పా అని ప్రశ్నించారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

కొత్తూరు: ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిక కుమార్, ఇరపాడు నిర్వాసితులు, వైసిపి కార్యకర్తలను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంగరాపు సింహాచలం ఒక ప్రకటనలో విమర్శించారు. బోయ, వాల్మీకిలను ఎస్‌టిల్లో చేర్చడాన్ని ప్రశ్నిస్తారని, నిర్వాసితుల సమస్యలపై నిలదీస్తారనే భయంతో అరెస్టులు చేయడం దారుణమని పేర్కొన్నారు.

అక్రమ అరెస్టులు తగవు

ప్రజాశక్తి-కొత్తూరు

అక్రమ అరెస్టులు తగవని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గంగరాపు సింహాచలం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి ఇచ్ఛాపురం పర్యటన సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పత్తిక కుమార్‌ను సీతంపేట మండలం పూతికవలసలో తన ఇంటివద్ద పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం తగదనీ,అలాగే ఇరపాడు నిర్వాసితులను, వైసిపి కార్యకర్తలు కె.సంజీవరావు, సూర్యనారాయణలను అరెస్టు చేయడం తగదన్నారు. అయితే బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చరాదని ప్రశ్నిస్తారనే భయంతో పోలీసులు అరెస్టు చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. అలాగే నిర్వాసితులు చంద్రబాబును ప్రశ్నిస్తారనే కారణంగా ముందస్తుగా కొత్తూరు పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చి వారిని అరెస్టు చేశారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటివి తగదన్నారు.

బ్యాంకుల్లో నగదు కొరత
ఇబ్బందుల్లో ఖాతాదారులు

ప్రజాశక్తి-హిరమండలం

బ్యాంకు లబ్ధిదారులకు నగదు కొరత వెంటాడుతోంది. గత మూడు రోజులుగా సంబంధిత లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి నగదు లభించకపోవడంతో వినియోగదారుల ఇబ్బందులు అధికమయ్యాయి. గతేడాది ఇదే సమయంలో పెద్ద నోట్ల రద్దుతో తంటాలు పడిన ఖాతాదారులు నేడు కూడా అలాగే ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతి సమీపిస్తుండటంతో నగదు పొందేందుకు బ్యాంక్‌ల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. దీంతో పాటు ఎటిఎంలు దిష్టి బొమ్మల్లా దర్శనమివ్వడమే తప్ప, అందులో నగదు లేదని వినియోగదారులు చెబుతున్నారు. విశ్రాంతి ఉద్యోగస్తులు నెలవారీ పింఛను పొందేందుకు ప్రతి రోజూ తిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే విషయాన్ని ఎస్‌బిఐ మేనేజర్ దివాకర్‌ను విలేకరులు ప్రశ్నించగా జిల్లా వ్యాప్తంగా నగదు కొరత ఉందనీ, నగదు పంపించినట్లయితే ఖాతాదారులకు అందించగలమని ఆయన పేర్కొన్నారు.

7న నిర్వాసితులకు 'జన్మభూమి'

ప్రజాశక్తి-హిరమండలం

ఈ నెల ఏడున నిర్వాసితులకు జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వి.రామస్వామి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిరమండలం మేజర్ పంచాయతీ సుభలాయ్ కమ్యూనిటీ భవనంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి నిర్వాసితులు సమస్యలు విన్నవించుకోవాలని ఆయన కోరారు.

పింఛను సాధన సమితి ఏర్పాటు

ప్రజాశక్తి-కొత్తూరు

మండలంలో పింఛను సాధన సమితిని ఏర్పాటు చేశారు. పింఛను సాధన కమిటీ స్టీరింగ్ కమిటీ కన్వీనర్‌గా పి.బాలరాజు, సభ్యులుగా శ్రీను, పురుషోత్తం, మహంతి, శాంతారావు, ధర్మారావుతో పాటు మరో 15 మంది ఉన్నారు. సలహాదారుగా డి.ప్రకాశరావు, నర్సింహం, లక్ష్మణరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేసి పాత పింఛను విధానాన్ని సాధించేంత వరకూ సాధన సమితి పోరాటాలు ఆగవని పేర్కొన్నారు.

180 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలో నీలానగరం, కత్తులకవిటి, నర్సిపురం, దశుమంతుపురం గ్రామాల్లో గురువారం నిర్వహించిన వైద్యపరీక్షల్లో 180 మందికి వైద్యులు ఎం.శృతి, ఎస్ఎస్‌వర్మలు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటికి సంబంధించి ఒక కేసు వచ్చిందని వైద్యులు తెలిపారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.ఆరోగ్య పరీక్షలు ఎప్పటికప్పుడు నేటి రోజుల్లో జరిపించుకోవాలని వైద్యులు సూచించారు. అందరికీ మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం అలవడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లతో పాటు ఎఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

పలు చోట్ల 'జన్మభూమి' బహిష్కరణ

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో గురువారం జరిగిన ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని నాలుగు పంచాయతీల్లో బహిష్కరించారు. దీంతో అధికారులు అవాక్కయ్యారు. మండలంలోని దారపాడు, కిల్లాడలో తహశీల్దార్ శ్రీనివాసరావు బృందంతో సభను నిర్వహించారు. ముందుగా దారపాడులో నిర్వహించిన జన్మభూమికి గ్రామస్తులు ఎవ్వరూ హాజరుకాలేదు. రెండు, మూడు గంటల పాటు అధికారులు ఎదురు చూసినా గ్రామస్తులెవరూ రాకపోవడంతో గిరిజన సంఘం కార్యదర్శి సాంబయ్య, మండల కార్యదర్శి గంగాధర, సర్పంచ్ సుందరమ్మ అధికారులకు వినతులిచ్చారు. బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దనీ, సెల్ టవర్ ఏర్పాటు చేయాలనీ, గెడ్డగూడ రోడ్డు అర్ధాంతరంగా నిలిచిపోయిందని ఆ పనులు పూర్తి చేయాలని విన్నవించారు. కిల్లాడ పంచాయతీలో కూడా గ్రామస్తులెవరూ రాకపోవడంతో అధికారులు పుర వీధుల్లో తిరిగి వెళ్లిపోయారు. కోడిశ, కుసిమి పంచాయతీలో జన్మభూమిని గ్రామస్తులు బహిష్కరించడంతో అధికారులు ఖంగుతిన్నారు. కుసిమి పంచాయతీలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణను గ్రామస్తులు నిలదీశారు. బోయ, వాల్మీకిలను ఎస్టీలో చేర్చొద్దనీ గిరిజనులంతా ర్యాలీ చేస్తే ఆ కార్యక్రమానికి స్థానిక నాయకులు మీరెందుకు రాలేదని నిమ్మక జయకృష్ణను నిలదీశారు. గిరిజన సలహా మండలికి తెలియపరచకుండా అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానించిందని జయకృష్ణ జవాబిచ్చారు. కార్యక్రమంలో సిడిపిఒ నాగరాణి, డిఇఇ నాగేశ్వరి, జెఇలు తిరుపతిరావు, సంగమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: మండలంలోని భాసూరు గ్రామ సభలో పలు సమస్యలపై గ్రామస్తులు నిలదీశారు. ఎంపిపి వారాడ లక్ష్మి సభను ప్రారంభించారు. అనంతరం జెడ్‌పిటిసి సభ్యులు సామంతుల దామోదరరావు, తహశీల్దార్ వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సభలో గ్రామస్తులు సమస్యలపై నిలదీశారు. రహదారులు, కాలువలు అధ్వాన్నంగా ఉన్నాయనీ, గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకురాగా దానిపై చర్యలు తీసుకుంటామని జెడ్‌పిటిసి సభ్యులు సామంతుల దామోదరరావు హామీనిచ్చారు. అలాగే పశువైద్యాధికారి సక్రమంగా విధులు నిర్వహించడం లేదని పాడి రైతులు సభ దృష్టికి తీసుకువచ్చారు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆగ్రహానికి లోనయ్యారు. సమస్యలు పరిష్కారం కాని సభలు ఎందుకని గ్రామస్తులు మండిపడ్డారు. జెడ్‌పిటిసి సభ్యులు పశుసంవర్ధకశాఖ జెడితో ఫోన్‌లో మాట్లాడారు. రోజూ క్రమం తప్పకుండా పశువైద్య కేంద్రం ద్వారా సేవలు అందించాలని జెడ్‌పిటిసి కోరారు.

నగర పంచాయతీ పరిధిలో 11వ వార్డులో జన్మభూమి గ్రామసభ జరిగింది. నగర పంచాయతీ అధ్యక్షులు పల్లా విజయనిర్మల, వైస్ ఛైర్మన్ సిరిపురపు చూడామణి, కమిషనర్ పి.బాలాజీప్రసాద్ ఆధ్వర్యంలో కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేశారు.

వీరఘట్టం: పాలమెట్ట వద్ద ఓపెన్‌హెడ్ ఛానల్‌కు తలుపులు వేయాలని నీలానగరం గ్రామంలో కార్యక్రమంలో రైతులు ఆరోపించారు. హెడ్‌ఛానల్ వద్ద తలుపులు తుప్పుపట్టడంతో సాగునీటికోసం తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందని వాపోయారు. నాగావళి నదిలో ఇసుక తవ్వకాలు ఎక్కువ జరపడంవలన నాగావళి నది లోతుగా అవ్వడంవలన ఓపెన్‌హెడ్‌ఛానల్‌కు నీరు రావడం లేదన్నారు. దీనిపై తోటపల్లి ప్రాజెక్టు ఛైర్మన్ నిమ్మక పాండురంగ కలుగజేసుకుని ఏఫ్రిల్ నెలలో నీరు-చెట్టు పథకం కింద పనులు చేపడతామని భరోసా ఇవ్వడంతో రైతులు శాంతించారు. కత్తులకవిటి, నర్సిపురం, దశుమంతుపురం గ్రామాల్లో కూడా జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, తహశీల్దార్ ఎం.వి.రమణ, ఎంపిడిఒ ఎం.చంటిబాబు, వైద్యాధికారులు ఎస్ఎస్ వర్మ, ఎం.శృతి, మాజీ ఎఎంసి ఛైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, రౌతు దామోదరరావు పాల్గొన్నారు.

భామిని: మండలంలోని నేరడి-బిలో గ్రామ సభ ఆరంభం నుండే స్థానికుల నుండి నిరసనలు ఎదురయ్యాయి.అర్హులకు పథకాలు అందడం లేదంటూ గ్రామస్తులు కేకలు వేశారు. సభలో అధికారులకూ, పాలకులకూ మాట్లాడే అవకాశం ఇవ్వలేదు.పింఛన్లు,ఇల్లు వంటి పథకాలు తమ దరికి చేరటం లేదని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. పథకాల పై చర్చిద్దామని వారించిన వినక పోవటంతో చేసేది ఏమి లేక వెనుదిరిగారు.కోరంలో , సతివాడ,బిల్లుమడలో ప్రశాంతంగా ముగిసింది. కార్యక్రంలో ప్రత్యేక అధికారి గార రవణమ్మ, తహశీల్దార్ సత్యం,ఎంపిడిఒ మల్లేశ్వరరావు,ప్రత్యేక అహ్వానితుడు జగదీష్ పాల్గొన్నారు.



సీతంపేటలోని కుసిమిలో గ్రామస్తులు రాకపోవడంతో వెనుదిరిగిన అధికారులు



పాలకొండలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తుడు

రికార్డుల నిర్వహణ తప్పనిసరి

ప్రజాశక్తి-సీతంపేట

ఉపాధిహామీ పథకం రికార్డులను అప్‌డేట్ చేస్తుండాలని జిల్లా ఉపాధి, ఫైనాన్స్ మేనేజర్ వివి.గోపాలకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ మొబైల్ అడ్వాన్స్ వర్క్‌వైజ్‌గా రికార్డులు, పెండింగ్ మొబైల్ అడ్వాన్స్‌లు అప్‌డేట్‌గా ఉండాలన్నారు. ఉపాధి పనుల్లో గ్రామ స్థాయిలో ఏడు, మండల స్థాయిలో 26 రికార్డులను నిర్వహించాలనీ, తప్పులు ఉండరాదన్నారు. కొన్ని మెటిరియల్ బిల్లులు కొన్ని ఆటంకాల కారణంగా చెల్లించలేదన్నారు. దాదాపు ఉపాధి బిల్లులు చెల్లించామనీ, ఆధార్ అనుసంధానం కాకపోవడంతో, బయోమెట్రిక్, సిగ్నల్స్ సమస్య కారణంగా, బ్యాంకు ఖాతాలు సరిగా లేకపోవడంతోనూ బిల్లులు లబ్ధిదారుల అకౌంట్లలో జమ కాలేదన్నారు. పనులు వేగవంతంతో పాటు బిల్లులు కూడా వేగవంతంగా చెల్లించాలని ఈ సందర్భంగా సూచించారు. సీతంపేట ఫైనాన్స్ రికార్డులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయనతో పాటు ఎంపిడిఒ రాధాకృష్ణన్, ఎపిఒలు శంకరరావు, రాజ్‌కుమార్ తదితరులున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఫైనాన్స్ మేనేజర్ గోపాలకృష్ణ

మహిళలు మరింతగా రాణించాలి

హిరమండలం: సమాజంలో మహిళలు మరింతగా రాణించాలని ఎంఇఒ కె.రాంబాబు సూచించారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని కెజిబివి పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళా పరిరక్షణకు అనేక చట్టాలను రూపొందించారనీ వాటిని అమలు చేయాలన్నారు. ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు మహిళల పేరిట అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఒ ఎస్.కృష్ణవేణి,ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.



క్రీడలు నిర్వహిస్తున్న పిఇటి

అంధులకు వెలుగు బ్రెయిలీ

హిరమండలం: అంధుల జీవితంలో వెలుగు నింపిన లూయి బ్రెయిలీ అని ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.సింహాచలం తెలిపారు. గురువారం లూయిబ్రెయిలీ వర్ధంతి సందర్భంగా స్థానిక పాఠశాలలో బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

డైరీ ఆవిష్కరణ

వీరఘట్టం: స్థానిక విద్యావనరుల కేంద్రంలో గురువారం తెలుగునాడు ఉపాధ్యాయుల సంఘం డైరీ ఆవిష్కరణను గురువారం ఎంఇఒ జి.సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన నాయకులకు ఉద్యమాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి చొరవచూపాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రామారావు, జగన్నాథం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

పాలకొండ: ఇటీవలే పాలకొండ పట్టణంలో వడ్డాదివారివీధిలో స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు టేకి నర్సింగరావు మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని గురువారం స్థానిక ఎంఎల్ఎ విశ్వాసరాయి కళావతి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు రామకృష్ణతో మాట్లాడి సంతాపం తెలియజేశారు.



టేకి రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

అటకెక్కిన 'ఎన్‌టిఆర్ సుజలధార'

❑ సామాన్యునికి అందని స్వచ్ఛమైన తాగునీరు ❑ దాతలు సహకరించినా దృష్టి సారించని వైనం


తుప్పుపట్టిపోతున్న నీటి శుద్ధి యంత్రం


నిరుపయోగంగా మారిన పథకం

ప్రజాశక్తి- రాజాం

ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా సామాన్యునికి సైతం స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎన్‌టిఆర్ సుజలధార పథకాన్ని 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చి 2015లో ప్రవేశపెట్టింది. ఇందుకు దాతల సహకారంతో పథక నిర్మాణం చేపట్టింది. మండలానికి ఒకటి, రెండు చొప్పునా ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేసింది. రూ.2ల కే 20 లీటర్లు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని ఆర్భాటంగా ప్రచారం చేసింది. జిల్లాలో ఎక్కడా ఇంతవరకూ ఒక్క పథకమూ పనిచేసిన దాఖలాలు కానరాలేదు. కొన్ని చోట్ల పథకం పనిచేసినా నిర్వహణా భారం అధికమై స్వయంశక్తి సంఘాలకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. దీంతో పథక లక్ష్యం నీరిగారిపోయింది. దాతలు పథక నిర్వహణకు అవసరమైన నిధులు సమకూర్చినప్పటికీ అధికారుల పర్యవేక్షణ లోపం, ప్రభుత్వ అలసత్వం కారణంగా వీటి నిర్వహణ ఆదినుంచి ఒక్క అడుగు ముందుకూ, మూడు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. తమ గ్రామాల్లో సుజలధార పథకాన్ని ప్రభుత్వం చేపడుతుందని, తద్వారా స్వచ్ఛమైన నీటిని సేవించి ఆరోగ్యాన్ని కాపాడుకోగలమనే సామాన్యుని ఆశ నీటి మూటలైంది.

ఉదాహరణకు...

రాజాం నగర పంచాయతీ పరిధిలోని కొండంపేటలో జిఎంఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా సుమారు రూ. 3.25 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సుజలధార పథకం ఎందుకూ కొరగాకుండాపోయింది. ప్రముఖ పారిశ్రామిక వేత్త జిఎంఆర్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ పథకం పనిచేస్తున్నా, నిర్వహణ భారంతో స్వయంశక్తి సంఘ సభ్యులు నష్టాలు పాలైపోతున్నారు. విద్యుత్ బిలుల్లకు సైతం డబ్బులు రాకపోవడంతో పథక నిర్వహణకు చేతులెత్తేశారు. అధికారులు సైతం దీనిపై దృష్టి సారించకపోవడంతో పథకం మూలకుచేరింది. ఇదే తరహాలో జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన సుజలధార పథకాలు మూలకు చేరినట్లు తెలియవచ్చింది.

'జన్మభూమి' మాకొద్దు


సంతకవిటి... ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

సంతకవిటి : మండల పరిధిలో తమరాం, రామారాయపురం గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో అధికారులను ప్రజాసమస్యలపై నిలదీశారు. గురువారం రామారాయపురంలో తహశీల్దార్ జి.సురేష్ ఆధ్వర్యాన నిర్వహించిన జన్మభూమిలో సర్పంచ్ ఎన్ని శ్రీనివాసరావు మా గ్రామానికి ఎటువంటి సంక్షేమ పథకాలు అందడం లేదని, గతంలో 34 మందికి వచ్చిన పింఛన్లు తొలగించారని మొరపెట్టుకున్నారు. గ్రామాల్లో సిసి రహదారులు కోసం దరఖాస్తులు చేసినా పట్టించుకునే నాథుడే కరవయ్యారన్నారు. మా సమస్యలు పరిష్కారం కాని జన్మభూమి కార్యక్రమం మాకొద్దని సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు బహిష్కరించారు. తమరాంలో కూడా ఎంపిడిఒ వేణుగోపాలనాయుడు ఆధ్వర్యాన నిర్వహించిన జన్మభూమిలో గ్రామానికి చెందిన 90 ఏళ్ల వృద్ధులకు, వితంతువులకు పింఛన్లు ఇవ్వని జన్మభూమి మాకొద్దని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.రాధ, డిటి గౌడ్, ఎపిఒ హరినాథ్ పాల్గొన్నారు. వాసుదేవపట్నం గ్రామంలో నిర్వహించిన జన్మభూమిలో వైస్ ఎంపిపి గండేటి కేసరి, టిడిపి సీనియర్ నేత కొల్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎన్ఇఆర్

సింహద్వారం నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని బంటుపల్లికి బంగారు బంటుపల్లిగా గతేడాది అవార్డు రావడం అందరికీ తెలిసిందే. అయితే జాతీయ రహదారి నుంచి బంటుపల్లికి వెళ్లే ముఖద్వారం వద్ద బంగారు బంటుపల్లి అనే సింహద్వారం ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా గురువారం తెలుగుదేశం పార్టీ ఎచ్చెర్ల నియోజకవర్గం నాయకులు నడుకుదిటి ఈశ్వరరావు, యునైటెడ్ బ్రేవరీస్ (బీరు) పరిశ్రమ యాజమాన్యం సంయుక్తంగా రూ.16 లక్షల వ్యయంతో సింహద్వారం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో యుబి పరిశ్రమ జనరల్ మేనేజర్ చిరంజీవిరావు, సిహెచ్‌సి అభివృద్ధి కమిటీ చైర్మన్ వెలివేటి సురేష్‌కుమార్, జి.జగన్నాథరావు, ఎం.కృష్ణానందం, గోపిన నారాయణరావు, ఉపాధ్యక్షులు టి.సూర్యనారాయణ, పంచాయతీ సెక్రటరీ అప్పారావు పాల్గొన్నారు.


సన్మానం చేస్తున్న అధ్యాపక సిబ్బంది

పిడుగు సూర్యారావుకి సన్మానం

ప్రజాశక్తి- రాజాం

రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్ధశాస్త్ర అధ్యాపకుని గానూ, ఎన్ఎస్ఎస్ పిఒ గానూ పనిచేస్తున్న పిడుగు సూర్యారావును గురువారం కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. గ్రామీణ మహిళా సాధికారత అనే అంశంపై పరిశోధన చేసి ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ (పిహెచ్‌డి) పొందిన సందర్భంగా ఈ సన్మానం చేశామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ తెలిపారు. ముందుగా సూర్యారావు దంపతులకు దుశ్శాలువా కప్పి ఆయన సాధించిన ఘనకార్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కొత్తా సాయిప్రసాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

'జగన్‌తోనే సుపరిపాలన'

రణస్థలం: రాష్ట్రానికి వైసిపి అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే రాజన్న రాజ్యం వస్తుందని ఎచ్చెర్ల నియోజకవర్గ సమన్వయ కర్త గొర్లె కిరణ్‌కుమార్, విజయనగరం పార్లమెంట్ అధ్యక్షులు బెల్లాన చంద్రశేఖర్ (పెదబాబు) అన్నారు. మండలంలోని రణస్థలం గ్రామంలో బుధవారం రాత్రి రచ్చబండ-పల్లెనిద్ర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించాల్సిన జన్మభూమి టిడిపి నాయకులు పార్టీ కార్యక్రమాలుగా నిర్వహించుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు గొర్లె రాజగోపాలరావు, నాయకులు పిన్నింటి లక్ష్మంనాయుడు, టొంపల సీతారాముడు, లంకలపల్లి ప్రసాద్, కరిమజ్జి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గొర్లె కిరణ్‌కుమార్


దుస్తులు పంపిణీ చేస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

బాధితులకు దుస్తులు పంపిణీ

రణస్థలం: మండలంలోని కొవ్వాడలో ఇటీవల ఐదు పూరిళ్లు కాలిపోయి సర్వం కోల్పోయిన అగ్ని బాధితులకు వైసిపి ఎచ్చెర్ల నియోజకవర్గ సమన్వయ కర్త గొర్లె కిరణ్‌కుమార్ గురువారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వం కోల్పోయిన అగ్ని బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మైలపల్లి పోలీసు, జగ్గులు, గ్రామస్తులు, అగ్నిబాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బియ్యం వితరణ

రాజాం : పట్టణంలోని మల్లిఖార్జున కాలనీ మొదటి లైన్‌లో న్యూలైఫ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తున్న అనాథ వృద్ధాశ్రమానికి ఎంఆర్ విజన్ అధినేత ముయిద ఆనందరావు గురువారం 50 కిలోల బియాన్ని వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు పి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆశ్రమం ఏర్పాటు చేసి రెండేళుల కావస్తుందన్నారు. ప్రారంభం నుంచి ప్రతినెలా క్రమం తప్పకుండా వృద్ధులకు సరిపడా బియ్యంను ఎంఆర్ వితరణగా అందిస్తూ తన ఔదార్యాన్ని చాటుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఆర్ పి.ఎ.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బియ్యం వితరణగా అందిస్తున్న ఆనందరావు

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

జె.ఆర్.పురం సిఐ కె.రామకృష్ణ


సిఐ రామకృష్ణ

ప్రజాశక్తి- రణస్థలం

జె.ఆర్.పురం సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు, పేకాట, బోకాట వంటి ఆటలు ఆడితే సహించేది లేదని, దాడులు చేసి పట్టుకుని చర్యలు తీసుకుంటామని జె.ఆర్.పురం సిఐ కె.రామకృష్ణ హెచ్చరించారు. ఈ సందర్భంగా గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సర్కిల్ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్ల ఆవరణలోని గ్రామాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా గస్తీ తిరగం తిరుగుతున్నారన్నారు. లావేరు, పొందూరు, ఎచ్చెర్ల ఎస్ఐలకు ఇప్పటికే కోడిపందాలు, పేకాట, బోకాట తదితర ఆటలపై నిషేధాలు జారీ చేసి అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపినా పట్టుకుని కేసులు నమెదు చేస్తామన్నారు. పండగ వేళ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సిబ్బంది చూడాలని ఆదేశించారు.

'సమస్యల పరిష్కారానికి వేదిక 'జన్మభూమి'



రణస్థలం... మాట్లాడుతున్న ఎంపిపి గొర్లె విజయ్‌కుమార్

రణస్థలం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక జన్మభూమి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎంపిపి గొర్లె విజయ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రేషన్ కార్డులు, పింఛన్లు, సంక్రాంతి చంద్రన్న కానుకలు పంపిణీ చేశారు. మండలంలోని సి.హెచ్.రాజాం, మరువాడ, ఎన్.జి.ఆర్.పురం, సంచాం గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కె.ధర్మారావు, వైస్ ఎంపిపి దుమ్ము అశోక్, నాయకులు డిజిఎం ఆనందరావు, తహశీల్దార్ కె.శ్రీరాములు, ఎంపిడిఒ యు,కుమార్‌పట్నాయక్, ఎంఇఒ ఎ.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

లావేరు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎంపిడిఒ ఎం.కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బెజ్జిపురం, బుడతవలస, గుమడాం, తామాడ గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుర్భాశి భార్గవి, డిటి బి.గిరిబాబు, ఎఒ ఆర్.అప్పారావు, సర్పంచులు యిజ్జాడ వరలక్ష్మి, శ్రీనివాసరావు, ఎంపిటిసి దివ్యభారతి, రాంబాబు పాల్గొన్నారు.

పది రోజుల్లో మూడో విడత రుణమాఫీ

నందిగాం రూపురేఖలు మారుస్తాం

కొండల ప్రాంతంలో రోడ్లు

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-నందిగాం

మూడో విడత రుణమాఫీ పూర్తిగా మరో పది రోజుల్లో వేయనున్నట్లు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గురువారం మండలంలోని నర్సిపురం పంచాయతీ పరిధిలోని నర్సిపురం గ్రామంలో నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడో విడత రైతు రుణమాఫీని మరో పది రోజుల్లో పూర్తి స్థాయిలో వేయనున్నట్లు తెలిపారు. అలాగే నందిగాం మండల రూపురేఖలను మార్చుతామన్నారు. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను సమానంగా అభివద్ధి జరిగేటట్లు చూస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ఆదాయం పింఛన్లకు,ఉద్యోగుల జీతాలకు మాత్రమే సరిపోతోందన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. హిజ్రాలకు రూ.1500 పింఛను పెన్షన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణుల ప్రసవాలకు తల్లీ,బిడ్డ ఎక్స్‌ప్రెస్‌తో పాటు రూ. ఆరువేలు ఆర్థిక సహాయం అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా రూ.రెండున్నర లక్షల రూపాయల వరకు వైద్య సేవలకు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఐదు వేల మందికి కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయనున్నామన్నారు. ఈ నెల నుంచి రేషన్‌లో బియ్యంతో పాటు పంచదార అందిస్తున్నామన్నారు. కిరోసిన్ ఇంజన్లు కలిగిన అందరికీ కిరోసిన్ ఇచ్చేందుకు ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. దీనికి సంబంధించి బ్యాంకర్ల సమావేశంలో వాటిపై చర్చించామన్నారు. భ రాష్ట్రంలో 16 శాతం తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. నీరు-చెట్టు కార్యక్రమం ద్వారా చేపట్టిన చెరువుల మరమ్మతులతో 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రస్తుతం పండించగలిగామన్నారు. వంశధార నిర్వాసితులకు బాధగా ఉంటుందనీ, అందుకు ప్రభుత్వం తొమ్మిది నిర్వాసిత గ్రామాలకు చెందిన 6700 కుటుంబాలకు రూ.460 కోట్లు అందించనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది ప్రతిరోజూ వంశధార కాలువల్లో నీరు పారేలా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. 2008లో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ కోసం కేవలం రూ.126 కోట్లు మంజూరు చేసి నాటి పాలకులు దిష్టి బొమ్మలా వదిలేశారనీ, అదే 2014 నుంచి రూ.500 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం వేసిన శిలాఫలకం ఉత్సవ విగ్రహంలా దర్శనమిస్తుందన్నారు. నందిగాంలో ఆఫ్‌షోర్ ద్వారా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది కొండల ప్రాంతంలో మట్టి రోడ్డు లేకుండా చేస్తామన్నారు. నందిగాం-పూండి రహదారికి రూ.15 కోట్లుతో మరో పది రోజుల్లో శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. చంద్రన్న పెళ్లి కానుకను ప్రకటించినట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన సాధికార మిత్రల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల గూర్చి వివరించనున్నట్లు ఆయన తెలిపారు ఈ సందర్భంగా లింగాలపాడుకు చెందిన పలువురు మహిళలు తమ గ్రామంలో రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయనీ, నీటి సమస్య ఉందని పార్వతి, ఆదిలక్ష్మి, జానకమ్మతో పాటు పలువురు మహిళలు మంత్రి దష్టికి తీసుకెళ్లారు. అంతకు ముందు రూ.45 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న దిమిలాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అజయకుమార్, తహశీల్దార్ ఎస్వీ.నాగేశ్వరరావు, సర్పంచ్ ప్రగడ బందావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు



పుస్తకాలు వితరణ చేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

గ్రంథాలయానికి వితరణ

ప్రజాశక్తి-పోలాకి

స్థానిక సూర్యభూషణ ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు డి.కామేశ్వరదాసుబాబు, ఎస్.కృష్ణ అన్నారు. గురువారం ఛారిటబుల్ ట్రస్టు ద్వారా సేకరించిన 60 పుస్తకాలను శాఖా గ్రంథాలయానికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలను చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయశాఖ కార్యదర్శి ఎం సత్యన్నారాయణ, ట్రస్టు ప్రతినిధులు డబ్బీరు.కామేశ్వరదాసుబాబు, సదాశివుని.కృష్ణ, వసంతకుమార్, గ్రంథాలయాధికారి చాయిరతన్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది, ఆశ వర్కర్లు, విద్యార్థులు

ఆరుబయట మలవిసర్జన వద్దు

పోలాకి: ఆరుబయట మల విసర్జన వద్దు, మరుగుదొడ్ల నిర్మాణం ముద్దు అని తలసముద్రం సర్పంచ్ వై.శ్రీరాములు అన్నారు. గురువారం మండలంలోని తలసముద్రం గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని విద్యార్థులు నినాదాలు చేశారు. రోడ్లపై చెత్తా చెదారాన్ని వేయరాదని అపరిశుభ్రతను విడనాడలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి భర్త శ్రీనివాసరావు, హెచ్ఎం సూరిబాబు, విఆర్వో జగన్నాథం, స్థానికులు పాల్గొన్నారు.

పారిశుధ్యంతోనే ఆరోగ్యం

కోటబొమ్మాళి: పారిశుధ్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కెవిఎస్.ప్రసాద్ అన్నారు. గురువారం కొత్తపేట జంక్షన్ నుంచి కోటబొమ్మాళి బస్టాండ్ వరకు మెయిన్‌రోడ్డుపై విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న వ్యక్తిగత మరుగుదొడ్లు ప్రతి ఒక్కరూ నిర్మించుకోవాలని తెలిపారు. అనంతరం మానవహారం నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా సమాజానికి పట్టిపీడుస్తున్న మురికిని వదిలి పారిశుధ్యం వైపు అడుగులు వేసి ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఆరంగి అప్పన్న, హనుమంతు మల్లేసు, రాజ సురేష్, సూర్యనారాయణ, ఇంద్ర కుమారి తదితరులు పాల్గొన్నారు.



మెయిన్‌రోడ్డుపై మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రత్యేక హోదాపై పోరాడండి

టెక్కలి వైసిపి ఇన్‌ఛార్జ్ తిలక్

ప్రజాశక్తి-టెక్కలి

విభజన అనంతరం రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదాపై విద్యార్థులు పోరాడాలని టెక్కలి వైసిపి సమన్వయకర్త పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదాపై వైసిపి కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్థానిక మదర్‌థెరీసా జూనియర్ కళాశాలలో విద్యార్థులతో తిలక్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదాతో రాష్ట్రంలో పెట్టుబడులు అధికమవుతాయన్నారు. పరిశ్రమలు ఏర్పడతాయన్నారు. నిరుద్యోగ యువతకు చదువు అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ విద్యకు కొమ్ముకాస్తూ, పేద విద్యార్థులకు అన్యాయం చేస్తోందని తిలక్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ స్వార్ధ ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదాను తాకట్టుపెట్టిందని తిలక్ ఆరోపించారు. అనంతరం వార్షిక పరీక్షలు, ఉపకారవేతనాలు సరిగ్గా అందుతున్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్ర చక్రవర్తి, తిర్లంగి జానకిరామయ్య, నౌగాం ఎంపిటిసి సభ్యులు పుష్యా సత్యం, సత్తారు సత్యం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న పేరాడ తిలక్

ఫ్లకార్డుల ధ్వంసంపై ఫిర్యాదు:

స్థానిక వైసిపి పార్టీ కార్యాలయం ఆవరణలోని బ్యానర్లు, ఫ్లకార్డులను ధ్వంసం చేయడంపై ఆ పార్టీ కార్యాలయం ఇన్‌ఛార్జ్ లాభాల శివకుమార్ గురువారం టెక్కలి పిఎస్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లకార్డులను ధ్వంసం చేసినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

వాస్తవాల ఆధారంగా పాలన ఉత్తమం

వైసిపి రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-సారవకోట

అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్ల అయినా ఎన్నాళ్ల ప్రజలకు మభ్య పెడతారనీ, వాస్తవాలతో పాలన చేయండి అని రాష్ట్ర వైసిపి రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గురువారం మండలంలోని పాతూరు గిరిజన గ్రామంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కటైనా నెరవేర్చిందా అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలను అమలు చేయకుండా పేదలను విస్మరిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని ఆయన అన్నారు. జిల్లాకు అనేక పర్యాయాలు వచ్చిన సిఎం జిల్లాకిచ్చిన హామీల్లో దేన్నయినా పూర్తి స్థాయిలో చేశారా అని ఆయన ప్రశ్నించారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు జిల్లా ప్రజలకు చేసిన మేలేమిటి అని ధర్మాన ప్రశ్నించారు. ఈయనతో పాటు వైసిపి పార్టీ మాజీ అధ్యక్షులు బంకి రమణమూర్తి, సర్పంచ్ కాళ్ల సింహాచలం, జి లక్ష్మీనారాయణ, బి మధు, మాజీ ఎంపిటిసి కరణం మనోహర్‌నాయుడు, కాంతారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

స్వచ్ఛత తప్పనిసరి

ప్రజాశక్తి-పోలాకి

గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక సలహాదారులు తమ్మినేని భూషణరావు తెలిపారు. గురువారం మండలంలోని బొద్దాం, కోడూరు, రాజపురం, గుప్పిడిపేట, పంచాయతీల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అలివేలుమంగమ్మ, తహశీల్దార్ జెన్ని రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ప్రత్యేక సలహాదారులు తమ్మినేని భూషణరావు ద్వారా చంద్రన్న సంక్రాంతి కానుకలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బి భాస్కరరావు, కిల్లి.వేణు, ఎం.వెంకటఅప్పలనాయుడు, సర్పంచ్‌లు దాలయ్య, కృష్ణారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

6న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-సారవకోట

ఈ నెల ఆరున ఎంపిపి చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎ జగదీశ్వరరావు తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

'జన్మభూమి'తోనే పరిష్కారం

కోటబొమ్మాళి: జన్మభూమి కార్యక్రమంతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని కోటబొమ్మాళి తహశీల్దార్ వాన శివబ్రహ్మానందం అన్నారు. గురువారం మండలంలోని జర్జంగి, దుప్పిలపాడులో జరిగిన జన్మభూమి సభల్లో తహశీల్దార్ పాల్గొన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ జన్మభూమిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. పంచాయతీలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి చొప్పున నిర్మించుకోవాలని సూచించారు. దీనికి ప్రభుత్వం నుంచి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురికి రేషన్ కార్డులు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలకు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అలాగే అంగన్వాడీ కేంద్ర పరిధిలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖాధికారి ఎన్.శ్రీనివాసరావు, ఎపిఒ జి.హేమసుందరరావు, విదుత్‌శాఖ ఎఇ ఎ.చంద్రశేఖరావు, ఐసిడిఎస్ పిఒ అనురాధ తదితరులు పాల్గొన్నారు.


ఇదే హరిసాగరం


హరిసాగరం దిగువ ఉన్న పంట భూములు

కలగా మిగిలిన మినీ రిజర్వాయర్


నాలుగేళ్లుగా మోక్షం కలగని వైనం
ఎస్‌సి కార్యాలయంలో పెండింగ్‌లో ఫైలు
ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - పలాస రూరల్

'దేశానికి వెన్నెముక లాంటి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం. రాష్ట్రానికి ఆహారాన్నందించే అన్నదాతకు వెన్నుదన్నుగా ఉంటాం. నీరు-చెట్టు పథకం కింద రూ.కోట్లు వ్యచ్చిస్తున్నాం. ప్రతి సెంటుకూ సాగునీరు అందిస్తాం' అంటూ ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకోవడమే తప్ప క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. వందలాది ఎకరాల విస్తీర్ణంలో హరిసాగరం ఉన్నప్పటికీ అటు ప్రభుత్వాలు, ఇటు పాలకులు మారుతున్నా మినీ రిజర్వాయర్‌గా నోచుకోవడంలేదు. హరిసాగరాన్ని మినీ రిజర్వాయర్‌గా మార్చితే సుమారు మూడు వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

మండలంలోని అల్లుకోల గ్రామ సమీపంలో సుమారు 120 ఎకరాల విస్తీర్ణంలో హరిసాగరం ఉంది. ఈ సాగరంపై అల్లుకోల, లొద్దభద్ర, జగన్నాథపురం, మరదరాజపురం, రాజగోపాలపురం తదితర గ్రామాల్లోని సుమారు 418 ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఈ సాగరంలోకి లొత్తూరు, సవర గోవిందపురం, గిరిజన గ్రామాల్లోని కొండలపై కురుస్తున్న వర్షపు నీరు చేరుతుంది. హరిసాగరాన్ని మినీ రిజర్వాయర్‌గా మార్చాలంటూ రైతులు, పాలకులు అప్పటి ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు సహకారంతో ఇరిగేషన్ ఎస్‌సి కార్యాలయ అధికారులను కోరారు. ఆ శాఖ నిర్లక్ష్యంతో సంబంధిత ఫైలు మూలకు చేరింది. అప్పటి అధికారులు సుమారు రూ.మూడు కోట్లు వ్యయంతో మినీ రిజర్వాయర్ నిర్మాణానికి ఇ5/1 మైనర్ ఇరిగేషన్ ఎల్ఆర్ నంబర్ 605, సి.ఇ/27-12-2006ను బొబ్బిలి సూపరింటెండెంట్ ఇంజినీరు సెక్రటేరియట్‌కు నిధులు మంజూరు నిమిత్తం పంపించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అటు పాలకులు, ఇటు అధికారులు దీన్ని గురించి పట్టించుకోలేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో పంట భూములకు సాగునీరు అందుతున్నా వేసవిలో చుక్క నీరు కూడా అందడంలేదని, రెండు పంటలు వేసుకునేందుకు వీల్లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హరిసాగరాన్ని మినీ రిజర్వాయర్‌గా మార్చితే అల్లుకోల, రెంటికోట, గంగువాడ, మరదరాజపురం, జగన్నాథపురం, లొద్దభద్ర, రాజగోపాలపురం, చినంచల తదితర గ్రామాల్లోని సుమారు మూడు వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశముందని, ఆరుతడి పంటలు సాగుచేసుకోవచ్చని చెబుతున్నారు. వందలాది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న హరిసాగరం ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందించాల్సిన అధికారులు, పాలకులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఖరీఫ్ సమయంలో పాడైన పంటలను పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్ ధనంజయరెడ్డి దృష్టికి పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు సమస్యను వివరించడంతో సంబంధిత ఫైలును అందజేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి హరిసాగరాన్ని మినీ రిజర్వాయర్‌గా మార్చాలని ఆయా ప్రాంత రైతులు కోరుతున్నారు.

ఇరిగేషన్ కార్యాలయంలోనే ఫైలు



హరిసాగరాన్ని మినీ రిజార్వాయర్‌గా మార్చేందుకు అప్పటి ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు ఎంతో కృషి చేశారు. అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సంబంధిత ఫైలు ఇరిగేషన్ కార్యాలయంలోనే ఉండిపోయింది. మినీ రిజర్వాయర్ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నాం. అధికారులు స్పందించి మినీ రిజర్వాయర్‌గా మార్చి, సాగునీరు అందించాలి.

-దువ్వాడ ప్రకాశరావు, అల్లుకోల మాజీ సర్పంచ్

మినీ రిజర్వాయర్‌గా మార్చాలి



హరిసాగరాన్ని మినీ రిజర్వాయర్‌గా మార్చితే వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఏడాదిలో రెండు పంటలు పండించుకునేందుకు అవకాశం ఉంటుంది. అధికారులు, పాలకులు మినీ రిజర్వాయర్ ఏర్పాటుకు కృషి చేస్తే రైతులకు మేలు చేకూరుతుంది.

-పైల సూర్యనారాయణ, అల్లుకోల

'అందరికీ ప్రభుత్వ పథకాలు'

ఎమ్మెల్యే శివాజీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివాజీ


వెలుగు అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

మందస: అన్ని తరగతుల వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ అన్నారు. గురువారం పి.డి.మందస, వి.జి.పురం గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. వి.జి.పురంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలతో లబ్ది పొందినవారు తమకు పథకాలు అందడంలేదని దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. ఫిర్యాదుల కోసం 1100ను సంప్రదించాలన్నారు. ఫిబ్రవరి నుంచి రేషన్ డిపోలు ద్వారా పంచదార, కిరోసిన్ అందిస్తామన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి వారికి రూ.30 వేలు, రూ.40 వేలు, రూ.50 వేలు చొప్పున చంద్రన్న పెళ్లి కానుకలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి దాసరి జయలక్ష్మి, తహశీల్దార్ శ్యామసుందరరావు, ఇఒపిఆర్‌డి రాజేశ్వరరావు, ఎఒ పోలయ్య, విద్యుత్ శాఖ ఎఇ సూర్యారావు, ఆర్‌ఐ డి.అమరనాథ్, సర్పంచ్ కె.గోపాలకష్ణ పాల్గొన్నారు.

పి.డి.మందసలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో టిడిపి, వైసిపి కార్యకర్తలు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. మందస నుంచి మధ్య మీదుగా పిడిమందస వరకు తారురోడ్డు నిర్మిస్తామని చెప్పి రెండేళ్లు కావస్తోందని, ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయడంలేదని వైసిపి కార్యకర్తలు నిలదీశారు. దీంతో ఇరుగ్రూపుల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. ఫోన్ ద్వారా సమాచారం అందుకున్న ఎస్‌ఐ రవికిరణ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

అధికారులను నిలదీత

పలాస రూరల్ : మండలంలోని రెంటికోట, లొద్దభద్ర గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమి గ్రామసభల్లో వివిధ సమస్యలపై ప్రజలు అధికారులను నిలదీశారు. అర్హులకు పింఛన్లు, రేషన్ కార్డులు అందడంలేదన్నారు. అర్హులకు అభయహస్తం స్కాలర్‌షిప్‌లను ఎందుకు వర్తింపజేయడంలేదని వెలుగు అధికారులను లొద్దభద్ర గ్రామస్తులు గురువారం నిలదీశారు. రెంటికోటలో నిర్వహించిన జన్మభూమి గ్రామసభలో జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ చైర్మన్ పి.విఠల్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి నెల నుంచి రేషన్ డిపోలు ద్వారా పంచదార, కిరోసిన్ పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డి.నర్సింగరావు, వంకల కూర్మారావు, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - పలాస

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మరుగుదొడ్ల ప్రాధాన్యతను వివరిస్తూ గురువారం పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో ర్యాలీ నిర్వహించారు. జన్మభూమి-మా ఊరులో భాగంగా విద్యార్థులు వివిధ కార్యక్రమాల్లో భాగస్వామ్యమయ్యారు. ర్యాలీలో ప్రిన్సిపల్ చింతాడ శరత్‌బాబు, కళాశాల సమన్వయకర్త టి.పాపారావు, అధ్యాపకులు కొండాల మధుబాబు, మార్పు కృష్ణమోహన్, కె.కేశవరావు, ఆర్.యుగంధర్ చౌదరి, బి.ప్రసాదరావు, ఎ.సరస్వతి, ఎన్.బాపూజీ పాల్గొన్నారు.



ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-మందస

స్థానిక షిరిడిసాయి ధ్యానమందిరం వద్ద యర్నాకుల దుర్గ గురుస్వామి స్మారకార్థం గురువారం నిరుపేదలు, సంచార జాతుల వారికి సంఘ సేవకులు గిన్ని తిరుపతిరెడ్డి దుప్పట్లు పంపిణీ చేశారు. పేదల సంక్షేమానికి ధ్యానమందిరం ట్రస్టు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సుధాకరరావు, నాగరాజు, శ్రీనివాసరావు, సురంగి హరిశ్చంద్ర, వల్లభరావు, మన్మథరావు పాల్గొన్నారు.


దుప్పట్లు అందజేస్తున్న తిరుపతిరెడ్డి

బాధిత కుటుంబానికి పరామర్శ

పలాస రూరల్: మండలంలో కేశుపురం గ్రామానికి చెందిన భరత్‌పాత్రో ఇటీవల గుండెపోటుతో మరణించారు. గురువారం వైసిపి పలాస నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయనతోపాటు మాజీ ఎంపిటిసి దంతం వైకుంఠరావు, గనియా తేజేశ్వరరావు, టి.రవిశంకర్, జయచంద్రపాత్రో, నాగేశ్వరపాత్రో తదితరులు ఉన్నారు.

పలాస: మున్సిపాలిటీలోని ఐదో వార్డు చినబాడాం గ్రామానికి చెందిన నాగలి తులసమ్మ ఇటీవల మృతి చెందింది. మృతురాలి కుటుంబాన్ని వైసిపి పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు గురువారం పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయనతోపాటు వైసిపి పట్టణాధ్యక్షులు దువ్వాడ శ్రీకాంత్, సన్యాసి ఆప్టో, వల్లభ వైకుంఠరావు, నాగలి సూర్యనారాయణ, డిక్కల లక్ష్మణరావు, పాపయ్య, గోపాలకృష్ణ, అప్పారావు, నిరంజన్, ఆటో యూనియన్ అధ్యక్షులు జి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న అప్పలరాజు


ఎంపికైన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

జాతీయ స్థాయి యోగా తరగతులకు
లింగాలవలస విద్యార్థులు

టెక్కలి: గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్‌లో ఈ నెల 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ జరగనున్న జాతీయస్థాయి యోగా తరగతులకు మండలంలోని లింగాలవలస ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం అనురాధ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తరుణ్(9వ తరగతి), ఆర్.లిఖిత(8వ తరగతి), ఎ.కరుణ(6వ తరగతి) తరగతులకు ఎంపికైనట్లు చ ఎప్పారు. వీరిని వ్యాయామ ఉపాధ్యాయులు బాడాన నారాయణరావు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

చెకుముకి పోటీలకు ముగ్గురు ఎంపిక

పాలకొండ: జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో తమ్మినాయుడు పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. పి.సురేష్‌నాయుడు, ఎస్.హరిచందన్‌నాయుడు, పి.కావ్యసింధు ఈ నెల 6, 7, 8 తేదీల్లో కర్నూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వీరిని పాఠశాల సిబ్బంది అభినందించారు.


ఎంపికైన తమ్మినాయుడు పాఠశాల విద్యార్థులు


రన్నింగ్ ట్రాక్‌ను సిద్ధం చేస్తున్న నిర్వాహకులు



మైదానాన్ని తడుపుతున్న నగరపాలక సిబ్బంది

నేటి నుంచి మాస్టర్ అథ్లెటిక్స్

12 కేటగిరీలు, 20 అంశాల్లో పోటీలు

జిల్లాకు చేరుకున్న వివిధ జిల్లాల క్రీడాకారులు

చురుకుగా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

హాజరవుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మాజీ కేంద్ర మంత్రి, కీర్తిశేషులు కింజరాపు ఎర్రన్నాయుడు మెమోరియల్ 37వ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా వేదిక కానుంది. జిల్లాలో మొదటిసారిగా రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్ పోటీలు నిర్వహంచేందుకు శాప్ నిర్ణయం తీసుకుంది. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానం వేదికగా శుక్రవారం నుంచి ఏడో తేదీ వరకు పోటీలను నిర్వహంచేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. 35 నుంచి 90 ఏళ్ల మధ్య వయసున్న వారు పాల్గొనే పోటీలను శాప్ ఆధ్వర్యంలో జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ, జిల్లా, రాష్ట్ర మాస్టర్ అసోసియేషన్‌తో పాటు వే ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. పోటీలు నిర్వహించేందుకు మైదానంలో ఏర్పాట్లను అసోసియేషన్ ప్రతినిధులు పర్యవేక్షిస్తున్నారు. పోటీలకు అనువుగా మైదానంలో రన్నింగ్ ట్రాక్‌లను సిద్ధం చేశారు. 13 జిల్లాల నుంచి పోటీల్లో పాల్గొనే 1200 మంది క్రీడాకారులు, మైనేజర్‌లు, కోచ్‌లు, శాప్ ప్రతినిధులు నగరానికి చేరేకుంటున్నారు. దూర ప్రాంత్రాల నుంచి క్రీడాకారలు ఇప్పటికే చేరుకున్నారు. వీరికి నగరంలోని హోటల్స్, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, వైసిటిలో వసతి కల్పించారు.

వయస్సుల వారీగా 12 కేటగిరీల్లో 20 అంశాల్లో పోటీలను నిర్వహించనున్నారు. 35 ప్లస్, 40, 45, 50, 55, 60, 65, 70, 75, 80, 85, 90 ప్లస్ వయో కేటగిరిల్లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నారు. 100, 200, 400, 800, 1500 ఐదు వేలు, పది వేలు మీటర్ల పరుగు పందాలు, 5కె, 10కె నడక పోటీలు, లాంగ్ జెంప్, హై జంప్, ట్రిపుల్ జంప్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, హేమర్ త్రో, 110, 400 మీటర్లు హర్డిల్స్, పోల్‌వాల్ట్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

క్రీడా శాఖ మంత్రి రాక

ఆర్ట్స్ కళాశాలలలో శుక్రవారం సాయంత్రం మూడు గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలకు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆయనతో పాటు జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపి రామ్మోహన్‌నాయుడు, జిల్లాలోని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, శాప్ ఎమ్‌డి బంగార్రాజు హాజరుకానున్నారు.


చురుకుగా వేదిక ఏర్పాట్లు

సావిత్రిభాయి స్ఫూర్తితో మహిళాభివృద్ధి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.వాగ్దేవి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దేశంలోనే మహిళాభివృద్ధికి ఊతమిచ్చిన ఘనత సావిత్రి భాయి ఫూలేకే దక్కుతుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.వాగ్దేవి అభిప్రాయపడ్డారు. గురువారం నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో నగరశాఖ ఆధ్వర్యాన సావిత్రి భాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో సావిత్రి భాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన పి.ఇందిరామణిని సత్కరించారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరధర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెడ్డి మోహనరావు, చౌదరి రవీంద్ర పాల్గొని మాట్లాడారు. బాలికా విద్యా వికాసానికి సావిత్రి భాయి పూలే చేసిన ఉద్యమాలను ప్రస్తావించారు. మహిళల సమ స్యలతో పాటు ఆకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో ఎపి ఉమెన్ టీచర్స్ ఫోరం జిల్లా కన్వీనర్ బి.ధనలక్ష్మి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అన్నాజీరావు, నగరశాఖ నాయకులు శిరీషా, రమణికుమారి, కుసుమ, తదితరులు పాల్గొన్నారు.


ఇందిరామణిని సత్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

బాబుపాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం

- సమస్యలు విన్నవించే వారిని అరెస్టు చేయడం దారుణం
- వైసిపి శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోందని వైసిపి శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు తమ్మినేని సీతారాం ధ్వజమెత్తారు. గురువారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబుకు సమస్యలు విన్నవించేందుకు సిద్ధమైన వైసిపి నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. జిల్లాలో సిఎం పర్యటన ఎమర్జన్సీని తలపిస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో ఎవరూ అడగకుండానే కొన్ని సామాజిక తరగతలకు రిజర్వేషన్ కల్పిస్తామని హామీనిచ్చి నేడు వారు ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టుచేయడం సరికాదని హితవు పలికారు. జన్మభూమి కార్యక్రమం టిడిపి కార్యకర్తలకు ఉపాది కల్పించడానికే ఉపయోగపడుతుందని విమర్శించారు. అర్హులకు మొండి చెయి చూపించి అనర్హులకు ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. నాలుగు జన్మభూమి కార్యక్రమాల్లో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల్లో సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జన్మభూమి కార్యక్రమం సీమంతాలకు వేదికలుగా చేసి కాలయాపన చేయడం తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. సిఎం పర్యటన కారణం చూపి ప్రతిపక్ష నాయకులను గృహనిర్బంధం చేయడం, విపక్షాలను అడ్డు కోవడం మంచి పద్ధతి కాదన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి ఎన్ని.ధనంజయరావు, జి.మల్లేశ్వరరావు, టి.కామేశ్వరి, పి.అశోక్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తమ్మినేని సీతారాం

ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి

గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రసాద్


రిలే నిరాహారదీక్షలు చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి - సీతంపేట

బోయ, వాల్మీకీలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి చేసిన ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు హిమరక ప్రసాద్ అన్నారు. బోయ, వాల్మీకీలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని సీతంపేట ఐటిడిఎ ఎదుట పుబ్బాడ పంచాయతీ గ్రామస్తులు చేస్తున్న రిలే నిరహార దీక్షలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ బోయ, వాల్మీకీలు అభివృద్ధి చెందిన కులాలన్నారు. ఇప్పటికే గిరిజనులు మౌలిక వసతులు, విద్య, వైద్యం రాయితీలు కోల్పోతున్నారన్నారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయకుండా వీరిని ఆ జాబితాలో చేర్చడం దారుణమన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం గిరిజనుల సంక్షేమాన్ని కోరితే గిరిజన గ్రామాలన్నింటినీ ఐదో షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. ఈ దీక్షలో కాంతారావు, పుబ్బాడ సర్పంచ్ కేశవరావు, పి.లక్షుమయ్య, ఎంపిపి భర్త చంద్రశేఖరరావు, పెదరామ సర్పంచ్ భర్త రామారావు తదితరులు పాల్గొన్నారు.